విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శనివారం 21 డిసెంబరు 2024 8 పేజీలు

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్

విశాలాంధ్ర - ఉండి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను అవమానపరుస్తూ పార్లమెంటులో అనుచితంగా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కేంద్ర మంత్రి పదవి నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. అమిత్ షా అంబేద్కర్‌ను అవమానపరుస్తూ పార్లమెంటులో చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం ఉండిలో సీపీఐ కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉండిలో అంబేద్కర్ విగ్రహానికి భీమారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆమోదించి 75 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగంపై పార్లమెంటులో జరుగుతున్న చర్చలో అంబేద్కర్ పేరును కాంగ్రెస్ నాయకులు పదే పదే జపించడం కన్నా భగవంతుని స్మరించి వుంటే స్వర్గం ప్రాప్తించి వుండేదని మాట్లాడి అంబేద్కర్‌ను తీవ్రంగా అవమానపరచిన అమిత్ షా కేంద్ర మంత్రిగా కొనసాగే నైతిక అర్హత లేదన్నారు. దేశానికి అత్యుత్తమ రాజ్యాంగాన్ని అందించి దశా దిశా నిర్దేశించిన అంబేద్కర్ పట్ల అమిత్ షా వ్యాఖ్యలు బిజెపి నిజస్వరూపాన్ని బట్టబయలు చేసిందన్నారు. తక్షణమే అమిత్ షాను కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసి నరేంద్ర మోడీ చిత్తశుద్ధి నిరూపించుకోవా లని భీమారావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాం ప్రసాద్, జిల్లా సమితి సభ్యులు సనపల శ్రీనివాస్, సీపీఐ నాయకులు తమరాని శ్రీనివాస్,పున్నాని అప్పారావు,ఆరవల్లి గంగాధర కుమార్,పడాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉద్యమంపై నిర్బంధ చర్యలు ఆపాలి

- వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధానం ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించాలి
- కేంద్ర ప్రభుత్వం రైతు సంఘాలతో వెంటనే చర్చలు జరపాలి
- 23న వ్యవసాయం, మార్కెటింగ్ జాతీయ విధానం ముసాయిదా పత్రాలు దగ్ధం
- నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఏలూరు : వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధానం ముసాయిదా ఫ్రేమ్ వర్క్‌ను వెంటనే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించాలని,రైతుల ప్రయోజనాలు బలిపెట్టి కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టే చర్యలు ఆపాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఏలూరు పవర్ పేటలోని అన్నే భవనంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సమావేశం నిర్వహించారు. ఈనెల 23న సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్త పిలుపు మేరకు వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధానం ముసాయిదా పత్రాలను దగ్ధం చేసి నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సమావేశం నిర్ణయించింది. సమావేశంలో బి.కే.యం.యు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్,కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన రావు,ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.శివ నాగరాణి జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తిరిగి తీసుకొచ్చేందుకు ▶మిగతా 2లో..

ఎంఎస్ఎంఇ కేంద్రంగా కోనసీమ

- 22న రామచంద్రపురంలో నిరుద్యోగులకు అవగాహన సదస్సు
- రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్రంలో నిరుద్యోగాన్ని నిర్మూలించి, స్వయం ఉపాధి ద్వారా నిరుద్యోగ యువతీ, యువకులను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు స్వర్ణాంధ్ర సృష్టికర్త, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్ష మేరకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నడుం బిగించారు. కోనసీమ జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలని, వాణిజ్య కేంద్రంగా (బిజినెస్ హబ్)గా మార్చేందుకు శ్రీకారం చుట్టారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నిరుద్యోగాన్ని రూపుమాపేందుకు ప్రణాళికలు రూపొందించి అమలుకు సన్నద్ధం అయ్యారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ద్వారా నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలనే సదుద్దేశంతో ఈనెల 22న ఉదయం 9 గంటలకు రామచంద్రపురంలోని వివిఎస్ఎం ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో, కెరీర్ గైడెన్స్ అందించే అనుభవజ్ఞులైన నిపుణులతో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. సుమారు 1020 లాభసాటి ఎంఎస్ఎం ఈ స్కీములను గుర్తించి మీకు ఇష్టమైన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు ▶మిగతా 2లో..

టీడీపీ సమావేశం రసాభాస

పార్టీ అధిష్టానంపై తెలుగు తమ్ముళ్ల ఆగ్రహం

విశాలాంధ్ర-కొవ్వూరు : కొవ్వూరు టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన నియోజకవర్గస్థాయి పార్టీ సమావేశంలో తెలుగు తమ్ముళ్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సమావేశం రసాభాసగా మారింది. ఈ సంఘటనకు ముఖ్య కారణం వైసీపీ ప్రభుత్వంలో సలహా దారుగా పని చేసిన రాజీవ్ కృష్ణను పార్టీ అధిష్టానం ముఖ్యంగా నారా లోకేష్ తెదేపాలోకి చేర్చుకోవడంపై టీడీపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో కొవ్వూరు నియోజకవర్గంలోని టిడిపి కార్యకర్తలను, నాయకులను అనేక అవస్థల పాలు చేసిన రాజు కృష్ణలాంటి వ్యక్తిని పార్టీలో చేర్చుకోవడం ఏమిటని నిరసన వ్యక్తం చేశారు, పార్టీ అగ్ర నాయకులు పెండ్యాల అచ్చిబాబు, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు, ఉమెన్ కమిటీ కమిటీ నాయకులు జొన్నల గడ్డ చౌదరి, కంటమణి రామకృష్ణలకు, స్థానిక నాయకత్వానికి తెలియజేయకుండా ఏకపక్షంగా టీడీపీలో చేర్చుకోవడం ఏమిటని ▶మిగతా 2లో..

పదిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

విద్యా శాఖ ప్రగతి లక్ష్యాలపై సమీక్షలో కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : జిల్లాలో పదవ తరగతి పరీక్షల్లో ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్య సాధన దిశగా ఇప్పటి నుంచే కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో విద్యా , అనుబంధ శాఖల జిల్లా , డివిజన్, మండల స్థాయి అధికారులతో విద్యా శాఖ ప్రగతి లక్ష్యాలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రశాంతి సమీక్షిస్తూ జిల్లాలో విద్యా ప్రమాణాలు మరింత మెరుగు పరచడం, నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యాలను సాధించడం పై చక్కటి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు బోధన విషయంలో నిర్లక్ష్యం వహించే ఉపాధ్యాయులు, అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి రోజు ఆయా మండల విద్యా శాఖ అధికారులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పర్యవేక్షణ హాజరు పక్కాగా నిర్వహించాలన్నారు. ప్రతి రోజు ఉపాధ్యాయులు సమయానికి 5 నిమిషాలు ముందుగానే వుండాలన్నారు. స్టూడెంట్స్ ఆధార్ అప్డేషన్, పాఠశాలల పర్యవేక్షణ, టీచర్స్, స్టూడెంట్స్ హాజరు, ఎఫ్ 1, ఎఫ్ 2, మార్క్ అప్డేషన్, మధ్యాహ్నం భోజనం పథకం వంటి అంశాల పై సమీక్షించారు. ప్రతి 15 రోజులకు ఒక సారి విద్యా ప్రగతి పై సమీక్షలు నిర్వహించడం జరుగుతుందని, లక్ష్య సాధనలో వెనుకబడినవారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత ఆగస్టు నెల నుంచి ఇప్పటి వరకు పారామీటర్లు వారి ప్రగతి నివేదికలు సమర్పించాలన్నారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, పాఠశాలలకు రాని విద్యార్థులపై దృష్టి సారించి అధికారులు పాఠశాలలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి కే.వాసుదేవ రావు మాట్లాడుతూ జిల్లాలో పదవ తరగతి నూరు శాతం ఫలితాలను సాధించే దిశగా 100 రోజులు అదనపు తరగతులు నిర్వహించి విద్యార్థులకు సబ్జెక్టులు వారి విద్యాబోధన చేయనున్నట్లు వివరించారు. సమావేశంలో డిఇఎల్‌డిఓ పి.వీణా దేవి, సమగ్ర శిక్ష ఎస్. సుభాషిణి, ఇంటర్మీడియట్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, ఆర్‌ఐఓ ఎన్ ఎస్ వి ఎల్ నరసింహారావు, మండల విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మమతానురాగాలకు ఆదర్శం తాతయ్య, అమ్మమ్మ

విశాలాంధ్ర-లింగపాలెం: తాతయ్య,అమ్మమ్మల పట్ల మనవళ్ళు, మనవరాళ్ళు అనురాగంతో ఉండాలని విద్యాశాఖ అధికారులు,మత గురువులు,రాజకీయ నాయకులు, ఉపాధ్యాయులు విద్యార్థులను కోరారు. ధర్మాజీగూడెం హోలీ ట్రినిటీ పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్‌డేను శుక్రవారం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు రామారావు,రవీంద్ర, అపస్మా డైరెక్టర్ జేవియర్ పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ రాజు,,స్థానిక ఫాదర్ గాబ్రియేలు, తెలుగుదేశం నాయకులు నందిగం సీతారాంతిలక్(బాబి) పాఠశాల ప్రిన్సిపాల్ కవిత ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వృద్ధాప్యంలో ఉన్నవారిపట్ల ప్రేమతో ఉండాలనే ఉద్దేశంతో పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వృద్ధాప్యంలో ఉన్న తాతయ్య అమ్మమ్మలను ప్రేమానురాగాలతో చూసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మనవళ్ళు, మనవరాళ్ళు, తాతయ్య అమ్మమ్మలకు బహుమతులు అందించారు. కన్నుల పండుగగా ఈ కార్యక్రమం సాగింది. ప్రేమ,ఆప్యాయతలతో సాగిన ఈ కార్యక్రమాన్ని తిలకించిన వారంతా కళ్ళుచమర్చారు. ఈ సందర్భంగా సెమీ క్రిస్మస్ వేడుక నిర్వహించారు.కేక్ కట్ చేశారు.స్వీట్లు పంచారు. కార్యక్రమంలో సిస్టర్ మిట్టిల్ల తదితరులు పాల్గొన్నారు.

26న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - పాలకోడేరు : ఈనెల 26న మధ్యాహ్నం రెండు గంటలకు పాలకోడేరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశ మందిరంలో మండల అధ్యక్షులు భూపతి రాజు సత్యనారాయణరాజు (చంటి రాజు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆర్. రెడ్డియ్య ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష ఉంటుందని అందువలన మండలంలోని అందరూ అధికారులు తప్పనిసరిగా తమ శాఖకు సంబంధించిన నివేదికలతో హాజరవ్వాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల సర్పంచులు, ఎంపిటిసీలు, జెడ్పిటిసి సభ్యులు, మండల, గ్రామస్థాయి అధికారులు పాల్గొంటారని అన్నారు.

విద్యార్థికి రామానుజన్ జీవితం ఆదర్శం

విశాలాంధ్ర - కాళ్ళ : ప్రతి విద్యార్థి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన భారత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన గణిత దినోత్సవ వేడుకలలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన శ్రీనివాస రామానుజన్ గొప్పతనాన్ని, నిత్యజీవితంలో గణితం ఉపయోగాన్ని వివరించారు. మండల విద్యాశాఖ అధికారి ఎ. రవీంద్ర మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఇటువంటి కార్యక్రమాలు జరగడం ద్వారా విద్యార్థులలో ఆదర్శ భావాలు పెంపొందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ప్రదర్శించిన బోధనాభ్యసన సామాగ్రి మేళాను వీరు పరిశీలించి ఉపాధ్యాయుల కృషిని అభినందించారు. తదుపరి గణిత సీనియర్ ఉపాధ్యాయులు బి. రామకృష్ణ , అరుణ కుమారి ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్పెషల్ పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులచే మెమెంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ2 జి.కనకరాజు, యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు సిహెచ్ పట్టాభి రామయ్య, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణంరాజు ఉపాధ్యాయులు బి.ఆర్.ఎం. కె.స్వామి,బి.మురళి, ఎం. శంకర్, పి.పాపారావు, సత్యనారాయణ, శ్రీరామకృష్ణ,భోగరాజు, అప్పలాచార్యులు, తిరుమల రావు, నరసింహారావు, విజయలక్ష్మి, కనకదుర్గ, గీత ప్రశాంతి, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర - కలిదిండి: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కలిదిండి సచివాలయం వద్ద జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలనలో మండల మెజిస్ట్రేట్, అన్ని శాఖల అధికారులు మీ ముందుకు వస్తున్నారని, మీ భూములకు సంబంధించిన సమస్యలు వివరించి పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రామకృష్ణ, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పోకల జోగిరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : పదవ తరగతి పరీక్ష ఫలితాలలో మంచి ఉత్తీర్ణత సాధించాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల చైర్ పర్సన్ కోడూరి రాధా పుష్పవతి పేర్కొన్నారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షులు మాటూరు సుధీర్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదవ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కోడూరి రాధా పుష్పవతి, కొత్త సత్యనారాయణమూర్తి, కటారి శారదా దేవిలు మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే పదవ తరగతి పరీక్ష ఫలితాలలో మంచి ఉత్తీర్ణత సాధించాలని, పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి, పేరు తీసుకురావాలని తెలిపారు. తమ జీవితంలో ఏవైతే ఉద్యోగాలు సాధించాలనుకుంటున్నారో, వాటికి సంబంధించి చదువులలో పోటీతత్వం పెంచుకొని ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు విద్యార్థులకు పెట్టిన ప్రశ్న పోటీలలో గెలుపొందిన వారికి, పదవ తరగతిలో బాగా చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు, మానవతా సంస్థ ద్వారా సర్టిఫికెట్లు, ప్యాడ్లు అందజేశారు. 150 మంది విద్యార్థులకు పెన్నులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కంభంపాటి సాయి కృష్ణ, మెట్టమర్రి ఉమామహేశ్వరరావు, వెత్స స్వామి, బాలుర ఉన్నత పాఠశాల, బాలిక ఉన్నత పాఠశాల, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రసాభాస

(1వ పేజీ తరువాయి)

ప్రశ్నించారు .కార్యకర్తలు, నాయకుల పై కేసులు పెట్టి పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పించారని అటువంటి వ్యక్తులను పార్టీలో చేర్చుకోవడం సరైన విధానం కాదన్నారు. ఒకదశలో సమావేశం అదుపుతప్పడంతో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు నాయకులు వారిని శాంత పరిచారు.అనంతరం ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ కార్యకర్తల ఆవేశంలో తప్పులేదని స్థానిక నాయకత్వానికి తెలియకుండా వైసీపీ నాయకులను చేర్చుకోవడం బాధాకరమన్నారు. ఈ విషయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి సమస్యను తెలియజేస్తానని ఎమ్మెల్యే ముప్పిడి వివరణ ఇచ్చారు. దీంతో కార్యకర్తలు, నాయకులు శాంతించారు. ఈ సమావేశంలో టూ మెన్ కమిటీ సభ్యులు, జొన్నలగడ్డ చౌదరి కంటమని రామకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ సూర పని చిన్ని సీనియర్ నాయకులు మద్దిపట్ల శివరామకృష్ణ, తాళ్లపూడి కి చెందిన నామన పరమేశ్వర రావు, చాగల్లుకు చెందిన నాయకులు ఆళ్ల హరిబాబు , సూర్యదేవర రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

కోనసీమ

(1వ పేజీ తరువాయి)

సహకరించేలా ఏర్పాట్లు చేశారు. పేపర్ వర్క్ నుంచి..బ్యాంకులో రుణం పొందే వరకు 10 టీములు మీకు సహకరిస్తాయి. స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యంగా ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్తను అందించాలనే ఉన్నతాశయంతో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఇన్ కోనసీమ నినాదంతో ఏర్పాటు చేసిన ఈ అవగాహన సదస్సులో ఉత్సాహవంతులైన వారు పాల్గొని మీకు ఇష్టమైన పరిశ్రమను ఎన్నిక చేసుకుంటే వాటి కార్యాచరణ అమలు, పరిశ్రమల స్థాపన జరిగే వరకు మంత్రి సుభాష్ ఏర్పాటు చేసిన 10 టీములు మీకు సహకరిస్తూ ముందుకు నడిపిస్తారు. ఈ సేవలన్నీ ఉచితంగానే అందిస్తామని మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రకటించారు.

ఈ గొప్ప అవకాశంను డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఉన్న ఉత్సాహవంతులైన నిరుద్యోగులు, వితంతువులు వినియోగించు కోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కోనసీమ ప్రజలను కోరారు.

చర్యలు ఆపాలి

(1వ పేజీ తరువాయి)

ప్రయత్నాలు చేయడం దుర్మార్గమన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 246 ప్రకారం వ్యవసాయ మార్కెటింగ్ రాష్ట్ర పరిధిలో ఉందన్నారు. రాష్ట్రాల హక్కులను హరించి వేయడం,రైతులకు మద్దతుగా ఉన్న వ్యవసాయ మార్కెట్లను రద్దు చేయడం కేంద్ర ముసాయిదా ఉద్దేశంగా ఉందన్నారు. పంజాబ్ సరిహద్దులో రైతులు చేస్తున్న ఉద్యమంపై నిర్బంధ చర్యలు ఆపాలని,కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని,రైతులతో చర్చలు జరపాలని కోరుతూ రైతు నాయకుడు జగజ్జీత్ సింగ్ దల్లేవాల్ 20 రోజులకు నిరాహార దీక్ష చేస్తున్న కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. ఆయన దీక్షను విరమింప చేయాలని కోరారు.

ఈనెల 23న జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని, రైతులు,వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.ఈ సమావేశంలో తామా ముత్యాలమ్మ, గుడెల్లి వెంకటరావు, అందుగుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

ధాన్యం రైతులకు చివరి దశలో ప్రతికూల వాతావరణం

విశాలాంధ్ర-లింగపాలెం: మెట్ట ప్రాంతంలో తుపాను ప్రభావం వల్ల వర్షాలు పడుతుండటంతో విక్రయాలకు సిద్ధంగా ఉంచిన ధాన్యపు రైతులు ఆందోళనలో ఉన్నారు.లింగపాలెం మండలంలో దాదాపుగా ధాన్యం కొనుగోలు చివరి దశకు వచ్చింది. మరో వెయ్యి టన్నుల ధాన్యాన్ని ఆరబెట్టి ఉంచారు. వరుసగా మూడు రోజుల నుంచి వాతావరణం

అనుకూలంగా లేకపోవడంతో ఆరబెట్టిన ధాన్యం ఆరక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. పరిస్థితులన్నీ అనుకూలంగా ఉన్న సమయంలో చివరి దశలో వాతావరణం ప్రతికూలంగా మారడంతో అధికారులు సైతం నిరుత్సాహం చెందుతున్నారు. ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్లు సజావుగానే సాగాయి. విక్రయించిన ధాన్యానికి 24 గంటల్లో నగదు రైతుల ఖాతాల్లో జమ అయ్యింది. ధాన్యం తడవకుండా ఉండేందుకు పరదాలు కప్పి ఉంచారు. మరికొంత ధాన్యాన్ని బస్తాలలో నింపి ఉంచారు. మూడు రోజులుగా పరదాలను తీసేందుకు వీలులేని పరిస్థితి నెలకొంది. ధాన్యం ఆరకపోతే మొక్క వస్తుందని ఆందోళన రైతుల నుంచి వ్యక్తం అవుతుంది.తేమ శాతం తగినంత లేకపోతే మిల్లర్ నుంచి ఇబ్బందులు ఎదురవుతాయని రైతులు వాపోతున్నారు. లింగపాలెం మండలంలో మరో 1200 క్వింటాళ్ల ధాన్యం విక్రయించాల్సి ఉంది. ధాన్యం తడవకుండా ఉండేందుకు తహసిల్దార్ నజీమ్, వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ ఈ రెండు శాఖల సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వీరు ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటించి పర్యవేక్షణ చేస్తున్నారు.

సప్తగిరి హోటల్ పై విజిలెన్స్ దాడులు

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం సప్తగిరి భోజన, కాఫీహోటల్లో విజిలెన్స్ శాఖ శుక్రవారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్ఐ సిహెచ్.రంజిత్ కుమార్, లింగపాలెం డిప్యూటీ తహసిల్దార్ ప్రసాద్,గ్రామ రెవెన్యూ

అధికారి ప్రభాకర్ ఈదాడిలో పాల్గొన్నారు. వ్యాపారానికి సంబంధించి గ్యాస్ సిలిండర్లు కాకుండా ఇళ్లకు వినియోగించే సిలిండర్లను నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్నారని దీనిపైకేసు నమోదు చేశారు. ఐదు సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న సిలిండర్లను లింగపాలెం ఇండేన్ గ్యాస్ కంపెనీలో ఉంచారు.

పారిశుద్ధ్య కార్మికుల పెండింగు జీతాలు తక్షణమే చెల్లించండి

విశాలాంధ్ర - చింతలపూడి : ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల నాలుగు నెలల పెండింగ్ జీతాలు విడుదల చేయాలని ఏఐటీ యూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తొర్లపాటి బాబు డిమాండ్ చేశారు. జీతాలు బకాయిలు చెల్లించాలని కోరుతూ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా తొర్లపాటి బాబు మాట్లాడుతూ నవంబర్ మాసంలో పారిశుద్ధ్య కార్మికులు ధర్నా చేసిన సందర్భంగా నవంబర్ 18 వ తేదీకి పెండింగ్ జీతాలు అన్ని విడుదల చేస్తామని హామీ ఇచ్చిన మేరకు సమ్మె విరమించారన్నారు. అప్పటికే నాలుగు నెలలు జీతాలు పీఎఫ్ బకాయిలు చెల్లించారని కానీ ఇంకా నాలుగు నెలల జీతాలు విడుదల చేయాల్సి ఉందని దీనిపై ఈ నెల 12వ తేదీ ఆరోగ్య శాఖ మంత్రికి ప్రభుత్వ ఉన్నత అధికారులకు ఈనెల 20వ తేదీకి జీతాలు విడుదల చేయకపోతే ఆందోళన చేస్తామని నోటీసు ఇచ్చినా స్పందించని పరిస్థితుల్లో నేడు ధర్నా నిర్వహించామని తెలిపారు. ధర్నాలో చింతలపూడి ఏరియా ఆసుపత్రి అధ్యక్షురాలు టి. మరియమ్మ, రాజు,రామకృష్ణ, రామమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు శివ కుమార్ డిమాండ్

విశాలాంధ్ర - ఏలూరు : అపరిష్కృతంగా ఉన్న విద్యార్థుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు డి. శివ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం మారినా విద్యార్థుల సమస్యలు పరిష్కారం కావా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చి 100 రోజులు పూర్తవుతుందని సంబరాలు చేసుకుంటున్నారని విద్యార్థుల సమస్యలు మాత్రం పరిష్కరించడం లేదన్నారు.తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యా సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా నాయకులు క్రాంతికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించండి

శానిటరీ, సెక్యూరిటీ సిబ్బంది నిరసన

విశాలాంధ్ర - ఏలూరు : తమకు బకాయి పడ్డ ఐదు నెలల జీతాలు తక్షణం చెల్లించేలా చర్యలు చేపట్టాలని శానిటరీ, సెక్యూరిటీ సిబ్బంది డిమాండ్ చేశారు. 5 నెలల జీతాలు చెల్లించాలని కోరుతూ శుక్రవారం స్థానిక జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపి మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కే.కృష్ణమాచార్యులు మాట్లాడుతూ ఏలూరు జిల్లా ఏరియా ఆసుపత్రి,కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో జిల్లా వ్యాప్తంగా 5 నెలలుగా కాంట్రాక్టర్ బకాయిలు చెల్లించటం లేదన్నారు. కాంట్రాక్టర్ తక్షణమే జీతాలు చెల్లించే విధంగా నిధులు మంజూరు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శికి విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. తక్షణం ఐదు నెలల జీతాలు చెల్లించాలని లేనిపక్షంలో సమ్మెకు వెళతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వి. దత్తాత్రేయ, విజయ, జయ, ఝాన్సీ, సెక్యూరిటీ సూపర్‌వైజర్ మొబైల్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది : ఎమ్మెల్యే

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పునరుద్ఘాటించారు. తమ సమస్యలు పరిష్కారమవ్వడంతో కృతజ్ఞతా పూర్వకంగా కొందరూ, తమ సమస్యల పరిష్కారం కోరుతూ మరికొందరూ వస్తున్నారు. ఇదే క్రమంలో శుక్రవారం కూడా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వినతులందించేందుకు వచ్చిన వారితో కిక్కిరిసింది. తనను కలిసేందుకు వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే బడేటి చంటి వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకుని వారికి భరోసా కల్పించారు. కొందరు తమకు ఇల్లు కట్టుకునేందుకు రుణాలు మంజూరు చేయించాలని కోరగా, మరి కొందరు ఉద్యోగులు బదిలీల అంశాన్ని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే బడేటి చంటి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కో - ఆప్షన్ సభ్యులు బోడే వెంకట రత్నం, టీడీపీ నాయకులు మామిళ్ళపల్లి పార్థసారధి, పెద్దిబోయిన శివప్రసాద్, అమరావతి అశోక్, ఆర్నేపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి

సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్

విశాలాంధ్ర-ఏలూరు : కేంద్ర హెూం మంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ డిమాండ్ చేశారు. సీపీఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో ఏలూరు పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ ఆశయాలను సాధిస్తామని జయహెూ అంబేద్కర్ అని, అమిత్ షా రాజీనామా చేయాలని, అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా క్షమాపణలు చెప్పాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ భారత దేశ రాజ్యాంగ నిర్మాత,దేశంలో అసమానతలు తొలగించడానికి తన జీవితకాలమంతా కృషి చేసిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచేలా రాజ్యసభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా వ్యాఖ్యలను భారత కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని తెలియజేశారు. అమిత్ షా పై గుజరాత్ రాష్ట్రంలో నమోదైన కేసులు గురించి చట్టసభలలో ఏనాడు చర్చ జరగలేదని, అటువంటి నేర చరిత్ర కలిగిన అమిత్ షా భారత దేశ రాజ్యాంగ నిర్మాతపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు ఏరియా సమితి సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు కొండేటి బేబి, జిల్లా సమితి సభ్యులు భజంత్రీ శ్రీనివాసరావు, ఏలూరు నగర కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల లక్ష్మీ ఇందిర,మావూరి విజయ,తెర్లాపు శ్రీను, ఎం.ఎ.హకీమ్, కొల్లూరి సుధారాణి, ఉప్పులూరి లక్ష్మి, భవాని అక్కిరెడ్డి వరలక్ష్మి,అబ్దుల్ రషీద్, మూర్తి, కే.భాస్కరరావు, ఆర్.సోమేశ్వరరావు, జి.ఈశ్వరరావు, ఎ.అప్పారావు, ఆలూరి రమేష్, జిజ్జువరపు సురేంద్ర, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో యువతకు బంగారు భవిష్యత్తు

రానున్న ఐదేళ్లల్లో 20 లక్షలమంది యువతకు ఉద్యోగ అవకాశాలు -మంత్రి కొలుసు పార్థసారథి

విశాలాంధ్ర-నూజివీడు : ప్రపంచం మొత్తం రాష్ట్రం వైపు చూసే విధంగా సాంకేతికతను రాష్ట్రానికి తీసుకువచ్చి యువతకు బంగారు భవిష్యత్తు అందించే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో శుక్రవారం 'మెగా జాబ్ మేళా' ను మంత్రి కలెక్టర్ కె. వెట్రిసెల్వి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యా, ఉద్యోగ, ఉపాధి కల్పనకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. రానున్న 5 సంవత్సరాలలో రాష్ట్రంలోని 20 లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో స్కిల్ హబ్‌లు ఏర్పాటుచేసి, యువతను అన్ని రంగాలలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో 8 స్కిల్ హబ్‌లలో యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ రాజ్, ట్రిపుల్ ఐటీ విసి అమరేంద్ర కుమార్, డి ఆర్ డి ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయరాజు, స్కిల్ డెవలప్మెంట్ అధికారి జితేంద్ర కుమార్, ప్రభుతులు పాల్గొన్నారు.

అంకితభావంతో వైద్యమందించాలి

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర -భీమవరం: పేదవారికి మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో ప్రభుత్వ వైద్యులు పని చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం భీమవరం ఏరియా హాస్పిటల్ లోని పలు విభాగాలను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ప్రసూతి వార్డును సందర్శించి ఆపరేషన్ చేయించుకున్న బాలింతలను పలకరిస్తూ ప్రతిరోజు మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా, వైద్య సేవలు ఎలా ఉన్నాయి, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. సీతాకాలం కనుక ఆపరేషన్ చేయించుకున్న వారికి మరింత జాగ్రత్తగా వైద్య సహాయం అందించాలని వైద్యులకు సూచించారు. నవజాత శిశువును జిల్లా జాయింట్ కలెక్టర్ ఎత్తుకొని పుట్టినప్పుడు బిడ్డ ఎంత బరువు ఉంది, ఇప్పుడు ఎంత ఉంది అని అడిగి తెలుసుకున్నారు. తల్లిపాలు కన్నా శ్రేష్టమైనవి ఏమి లేవని బిడ్డ పుట్టిన ఒక గంటలోపుగా తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలన్నారు. ఆసుపత్రి తనిఖీ సందర్భంలో డి సి హెచ్ ఎస్ డా.పి.సూర్యానారాయణ, హాస్పటల్ సూపరింటెం డెంట్ బి.మాధవి కళ్యాణి, సిబ్బంది, తదితరులు ఉన్నారు .

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : ఏపీ మెడికల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా పిలుపులో భాగంగా శుక్రవారం జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ శానిటేరీ వర్కర్స్, సెక్యూరిటీ సిబ్బంది హాస్పిటల్ ఎదుట ధర్నా చేశారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి కూనపాముల విఘ్నేష్ మాట్లాడుతూ ""ఫస్ట్ ఆబ్జెక్టివ్ "" అనే ఏజెన్సీ కాంట్రాక్టు వ్యవస్థ నెల నెల కార్మికులకు జీతాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని,కార్మికుల వేతనాలు నుండి కట్ చేసిన డబ్బులను పిఎఫ్ ఖాతాలకు సక్రమంగా చెల్లించలేని పరిస్థితి నెలకొందని ఆయన కాంట్రాక్టర్ తీరును ఎండగడుతూ,సిఎల్,మౌలిక సదుపాయాలు, క్రమమైన పద్ధతుల్లో చెల్లించలేని ఏజెన్సీని ప్రభుత్వం తక్షణమే రద్దు చెయ్యాలని ఆయన డిమాండ్ చేశారు. వెంటనే 4 నెలలు బకాయి ఉన్న జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు మాట్లాడుతూ ఇదే విధంగా కార్మికులను మోసం చేసి మాయమాటలు చెప్తే జిల్లా వ్యాప్తంగా కార్యక్రమం ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్మికులకు జీతాలు చెల్లించలేని అసమర్ధ కాంట్రాక్టు ఏజెన్సీ వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయుసి గౌరవాధ్యక్షులు జంపన వెంకటరమణ రాజు, కంతేటి వెంకటరావు, బొక్క శ్రీనివాస్, ఏరియా హాస్పిటల్ అధ్యక్షులు దయమని, మేరీ, ప్రభావతి, వేముల రాజు, సంజీవరావు ,శ్రీను,హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ శతవార్షిక ఉత్సవాలను ఘనంగా నిర్వహించండి

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర -ద్వారకాతిరుమల : కష్టజీవుల, శ్రమజీవుల అభ్యున్నతి కోసం ఆవిర్భవించిన సిపిఐ 100వ వ్యవస్థాపక దినోత్సవం ఈ నెల 26న వాడవాడల ఘనంగా నిర్వహించాలని సిపిఐ శ్రేణులకు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ద్వారకా తిరుమలలో సిపిఐ ద్వారకాతిరుమల మండల సమితి సమావేశం మాండ్రు బాలరాజు అధ్యక్షతన జరిగింది. మండలంలో సెప్టెంబర్ 20న మహాసభ జరిగిన నాటి నుండి నేటి వరకు నిర్వహించిన కార్యక్రమాల రిపోర్టును సిపిఐ మండల కార్యదర్శి గోలిమే బాల యేసు వివరించారు. ఈ సమావేశంలో అతిథిగా పాల్గొన్న బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీగా 99 సంవత్సరాలుగా దేశంలో దున్నేవాడికే భూమి కావాలని అనేక ఉద్యమాలు నిర్వహించి లక్షలాది ఎకరాలు భూములను పేదలకు సాధించిన ఘనత సిపిఐకి ఉందన్నారు. సమావేశంలో సిపిఐ మండల సమితి సభ్యులు గంజి పెద్దిరాజు, ఎం. రమేష్, పి. ప్రభావతి, ఎం. రవి, జి. నాగలక్ష్మి పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర -భీమవరం: రక్తదానం ప్రాణ దానంతో సమానమని, ఒక నిండు ప్రాణాన్ని రక్షిస్తుందని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రా రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రక్తదానం చేయడం సామాజిక బాధ్యతని, సమాజంలో రక్తదానం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. తలసేమియా బాధితులను రక్తదానం ద్వారా ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వరరావు, హెచ్ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు సబ్ కలెక్టర్‌గా స్మరణ్ రాజ్

విశాలాంధ్ర- నూజివీడు: నూజివీడు సబ్ కలెక్టర్‌గా నియమితులైన స్మరణ్ రాజ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన నూజివీడు ట్రిపుల్ ఐటిలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళా లో పాల్గొన్న రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధిని, ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్విని మర్యాదపూర్వకంగా కలిశారు . ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ ను అభినందిస్తూ నూజివీడు రెవిన్యూ డివిజన్ లో ప్రభుత్వం అమలుచేసే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమా లను అంకితభావంతో ప్రగతిపథంలో ఉంచాలని సూచించారు. అనంతరం ఇరువురు నియోజకవర్గానికి సంబంధించిన అంశాలపై చర్చించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు అండ

విశాలాంధ్ర – గణపవరం: ప్రతి పేదవాడికి వివిధ ఆరోగ్య సమస్యల కారణంగా చికిత్స చేయించుకుని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ అండ అని ఉంగు టూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు అన్నారు శుక్రవారం గణపవరం నిడదవోలు మండలాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను ఆయన పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి వారికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. 12 మంది పేషెంట్ల (లబ్ధిదారుని) కుటుంబాలకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ను చెక్కు రూపంలో ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ వాసు రాజు, చింతలపాటి బాసి రాజు, తోట శ్రీను, క్రొవ్విడి కృష్ణసాయి, మండల, గ్రామ జనసేన,టీడీపీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పట్ల మానవత్వం ప్రదర్శించాలి : ఏఎస్పీ పిలుపు

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : సమాజంలో దివ్యాంగుల పట్ల మానవత్వాన్ని ప్రదర్శిస్తూ వారిని ఆదరిస్తే వారిలో కూడా బుద్ధి కుశలతను పెంపొందించవచ్చునని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. జిల్లాలోని పెదపాడు మండలం వట్లూరు గ్రామంలో ఉన్న కరుణాలయ ఆర్పియం చర్చ్ ప్రాంగణంలో రెవరెండ్ ఫాదర్ అస్సీసీ ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సభలో ఏఎస్పి సూర్యచంద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ పుట్టుకతో దివ్యాంగులైన బాలబాలికల సంస్మరణార్థం ప్రతి సంవత్సరం డిసెంబర్ 15వ తేదీన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం జరుపుకుంటున్నారని అన్నారు. దివ్యాంగులకు సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలను అందించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల సతీష్, ముళ్ళపూడి సాంబశివరావు, వట్లూరు సర్పంచ్ గుజ్జుల రత్నకుమారి, ఆర్పియం చర్చి ఫాదర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి వర్తకుల వినతి పత్రం

విశాలాంధ్ర- జీలుగుమిల్లి, : జీలుగుమిల్లి నుండి పట్టిసీమ వరకు 365 జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూమి కోల్పోయిన వారికి తగిన పరిహారం ఇవ్వాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాల రాజుకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం జీలుగు మిల్లిలో గద్దమణుగు రవికుమార్ నివాసం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్తకులు మాట్లాడుతూ జీలుగుమిల్లిలో మాత్రం గజానికి 600 రూపాయలు మాత్రమే పరిహారం ఇవ్వటం సరికాదని అన్నారు. తెలంగాణ రాష్ట్రం అశ్వరావుపేటలో గజానికి 3500 రూపాయలు ఇస్తున్నారని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో సంబంధం లేకుండా పరిహారం ఇవ్వాలని కోరారు.

ఇంధన పొదుపు భవిష్యత్ తరాలకు అవసరం

ఎలక్ట్రికల్ ఎస్ఈ ఆలపాటి రఘునాథ్

విశాలాంధ్ర -భీమవరం: ఇంధన పొదుపు భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమని, విద్యుత్‌ను పొదుపు చేయడం సామాజిక బాధ్యతని జిల్లా ఎలక్ట్రికల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆలపాటి రఘునాథ్ బాబు అన్నారు. భీమవరం ఇండస్ట్రియల్ ఏరియాలో ఎలక్ట్రికల్ డిఈ కార్యాలయంలో విద్యుత్ పొదుపు వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథ్ బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అవసరం లేని సమయంలో స్విచ్ ఆఫ్ చేయాలని, ఒక యూనిట్ విద్యుత్తును ఆదా చేస్తే రెండు యూనిట్లు ఉత్పత్తి భారం తగ్గుతుందన్నారు. ఇంధనాలు వృథా చేసినందువల్ల డబ్బు వృధాతో పాటు, ఇంధన వనరులు అంతరించే ప్రమాదం కూడా ఉందన్నారు. ఎలక్ట్రికల్ డిఈ ఎన్.వెంకటేశ్వరరావు, ఏడిఈ కే.రాంబాబు, ఇంజనీర్ పద్మశ్రీ మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం పెరగడం ఇంధనాలను ఖర్చు పెట్టడం వల్ల మొక్కలు, జంతువులు, ఇతర సహజ వనరులన్నీ దెబ్బతింటాయని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగ సాయి మాట్లాడుతూ వారంరోజులుగా వివిధ పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు విద్యుత్ పొదుపుపై పోటీలను నిర్వహించామని గెలుపొందిన వారికి బహుమతులు ప్రశంసా పత్రాలను అందించామని తెలిపారు. వారోత్సవాల్లో విశేష సేవలందించిన రంగసాయి పలువు రిని సత్కరించారు. కార్యక్రమంలో ఝాన్సీ, కే.రాంబాబు, బాపూజీ, ఎలక్ట్రికల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమవరంలో తల్లిపాల బ్యాంకు

విశాలాంధ్ర -భీమవరం: తల్లిపాలు ఇవ్వడం ద్వారా ప్రయోజనాలను ప్రతి ఒక్క తల్లి అవగాహన కలిగి, ఆచరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం భీమవరం ప్రభుత్వ ప్రాంతీయ ఏరియా ఆసుపత్రిలో నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ దాతృత్వంతో సుశేనా హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధాత్రి తల్లిపాల బ్యాంకును, బాలింతల నిర్వహణ కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లా డుతూ భీమవరంలో తల్లిపాల బ్యాంకును ఏర్పాటు చేసుకోవడం ఎంతో సంతోషించ దగిన విషయం అన్నారు. రాష్ట్రంలోనే భీమవరంలో రెండవ తల్లిపాల బ్యాంకును ప్రారంభించడం జరిగిందని, మొదటి తల్లిపాల బ్యాంకు కాకినాడలో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్.సి.సి) చైర్మన్ డాక్టర్ ఏ.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ దేశం మొత్తంలో ఇప్పటివరకు ఆరు తల్లిపాల బ్యాంకులకు సిఎస్ఆర్ నిధులను ఇవ్వడం జరిగిందని తెలిపారు. మరిన్ని తల్లిపాల బ్యాంకులను నెలకొల్పేందుకు సహకారం అందించనున్నట్లు తెలిపారు.సుశేనా హెల్త్ ఫౌండేషన్ డైరెక్టర్ కాశీనాథ లక్కరాజు మాట్లాడుతూ తల్లులకు సమగ్ర లాక్టేషన్ మద్దతు అందించడానికి, శిశువులకు అత్యుత్తమ పోషణను నిర్ధారించడానికి ఏర్పాటు చేయబడిందన్నారు. తొలుత తల్లిపాల బ్యాంకు ప్రారంభానికి ముందు పూజ నిర్వహించి, రాత్రి బాలింతల నిర్వహణ కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం మిషనరీ పనితీరు వివరాలను ధాత్రి లాక్టేషన్ మేనేజ్మెంట్ యూనిట్ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. తదుపరి తల్లిపాల సేకరణ, నిల్వ ఎక్విప్మెంట్ ను జిల్లా జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, భీమవరం ఆర్డీవో ప్రవీణ్ కుమార్ రెడ్డి, డిసిహెచ్ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ, భీమవరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.మాధవి కళ్యాణి, నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ ఏ.దుర్గాప్రసాద్, సుశేనా హెల్త్ ఫౌండేషన్ డైరెక్టర్ కాశీనాథ లక్కరాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రూ.93లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: సమిష్టి కృషితో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని, పార్టీలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు.స్థానిక 2వవార్డు గాయత్రి దేవి ఆలయం వద్ద 33.93 లక్షల రూపాయలతో కాంపౌండ్ వాల్ నిర్మాణం, నిట్ కాలేజ్ ఎంట్రన్స్ పశ్చిమ ద్వారం వద్ద 40 లక్షల రూపాయలతో ఆర్ సి సి డ్రైన్ మరియు కల్వర్టు నిర్మాణం, బాల కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద సీసీ 4.98 లక్షల రూపాయలు సి సి డ్రైన్ , శ్రీ బలుసులమ్మ అమ్మవారి ఆలయం వద్ద 4.9 8 లక్షల రూపాయలు సి సి డ్రైన్ నిర్మాణం, జువ్వలపాలెంలో 15 లక్షల రూపాయలతో మూడు సి సి రోడ్ల నిర్మాణానికి మొత్తం 97 లక్షల 98 వేల రూపాయల అంచనాలతో ప్రారంభమయ్యే పనులకు శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి గూడెం మున్సిపల్ కమిషనర్ ఎం. ఏసుబాబు, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న రవళి స్పిన్నర్స్ డైరెక్టర్ వంక రవళి

విశాలాంధ్ర-తణుకు: రవళి స్పిన్నర్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ వంక రవళి శుక్రవారం అవార్డును అందుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కన్సర్వేషన్ మిషన్, ఎనర్జీ కన్సర్వేషన్ వెలెడిక్టరీ ఫంక్షన్‌లో రవళి స్పిన్నర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు లభించిన అవార్డు ను, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఫర్ ఎనర్జీ కె విజయానంద్, సంస్థ డైరెక్టర్ వంక రవళి అందుకున్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ జెన్కో ఎండీ కే.వి.ఎన్. చక్రధరబాబు, ఏపీ సీపీడీసీఎల్ చైర్మన్ రవి పట్టంచెట్టి, ఏపి.ఎస్.ఇ.సి.ఎల్.ఎం. కమలాకర బాబు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర – కొయ్యలగూడెం : గ్రామాలలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు తహసీల్దారు చల్లనదొర పేర్కొ న్నారు. మండలంలోని బయ్యలగూడెం గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సభలో గ్రామంలోని పలు సమస్యలను వినతి పత్రం ద్వారా తహసీల్దారుచల్లన్న దొరకు గ్రామస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మి, ఆర్ఐ మణి దివ్య, పోలవరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు, .నరేష్, కూటమి పార్టీల నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: మండలంలోని పి సూరవరం గ్రామంలో ఎస్జిటిగా విధులు నిర్వహిస్తున్న కంపా రమేష్ అనారోగ్య కారణాల రీత్యా శుక్రవారం మరణించారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రమేష్ భౌతికకాయాన్ని మండల విద్యాశాఖాధి కారులు సర్వేశ్వరరావు, ఆనందకుమార్, నాగభూషణం సందర్శించి నివాళులర్పించారు. వారి మరణం పట్ల ఎస్.టి.యు మండల శాఖ, ఎం.ఆర్.సి సిబ్బంది విచారం వ్యక్తం చేసింది.

పేదరిక రహిత ఆరోగ్య గ్రామాలుగా మార్చేందుకు కృషి

విశాలాంధ్ర – పాలకొల్లు : పాలకొల్లు ఎంపీడీవో కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మూడవ బ్యాచ్ శిక్షణా కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి పాలకొల్లు ఎంపీడీవో ఎన్.ఎన్ ఉమామహేశ్వర రావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ పేదరికం లేని, ఆరోగ్యకరమైన గ్రామాలను తయారు చేసేందుకు, కార్యక్రమం లక్ష్యం సిద్ధించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. ఈఓపిఆర్డి. టి.మూర్తి బాబు.ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి : జేసీ

విశాలాంధ్ర - సీతానగరం: రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ చిన రాముడు అన్నారు. శుక్రవారం మండలంలో కాటవరం, జాలిమూడి గ్రామాలలో తహసీల్దార్ ఏ శ్రీనివాస్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఈ సదస్సులు ఆకస్మిక తనిఖీలో భాగంగా జాయింట్ కలెక్టర్ చిన రాముడు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు మాట్లాడుతూ రైతులు తమ గ్రామాలలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను రెవెన్యూ సమస్యలు పరిష్కరించు కోవడానికి మంచి సమయం అని దానిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2025 జనవరి నుంచి రీ సర్వే తిరిగి ప్రారంభం అవుతుంది అని కావున రైతులు తమకు కేటాయించిన సర్వే నెంబర్ల ఆధారంగా రెవెన్యూ అధికారులకు అందుబాటులో ఉండి తమ తమ దస్తావేజులు, పట్టాదారు పాస్ పుస్తకాలను అధికారులు చూపించి రి సర్వేకు సహకరించాలని కోరారు. సీతానగరం మండలంలో మిర్తిపాడు గ్రామంలో రీ సర్వే ప్రారంభం అయ్యి తరువాత కాటవరంలో కూడా జరుగుతుందన్నారు. కావున రైతులు రోజు తమకు కేటాయించిన సర్వే నెంబర్ల రైతులు తమ పత్రాలతో హాజరు హవ్వాలి తప్పా ఇతర రైతులు వచ్చి అధికారులను గందరగోళానికి గురి చేయకూడదన్నారు. జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ఏ విధమైన రెవెన్యూ సమస్యలు ఉన్న అధికారుల ద్వారా పరిష్కారం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈ ఓ సత్యనారాయణ, మత్య శాఖ అధికారి చక్రవర్తి, సబ్ రిజిస్ట్రార్, అర్ ఐ నవీన్, వి ఆర్ ఓ గంగరాజు, సర్పంచ్, చిట్టూరి రంగారావు, మండల సర్వేయర్ గౌతమ్, రైతులు, సచివాలయం సిబ్బంది, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ తనిఖీలపై వినతి పత్రము అందజేత

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ మున్సిపల్ కమిషనర్ కెవిఆర్ఆర్ రాజుకి వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు దేవాదుల సూర్యనారాయణమూర్తి పట్టణ సమస్యలపై పార్టీ సభ్యులు వినతి పత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం పట్టణంలో ప్లాట్ ఫామ్‌పై ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటల్స్ ఫుడ్ తనిఖీలు నిర్వహించాలని, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల కలర్స్ వాడకాలు ఎక్కువగా ఉన్నాయి. వాటి వల్ల ప్రజారోగ్యం అనారోగ్యానికి గురవుతారని వీటిని నిషేధించాలని, టేస్టింగ్ సాల్ట్ వంటి పదార్థాలు వాడకం వల్ల షుగర్ ఎక్కువగా ప్రబలుతోందని, వీటి వాడకానీ నిషేధించాలని, పట్నంలో డిస్పోజల్ కవర్లు,గ్లాసులు, వాడకం ఎక్కువగా ఉండదని, ఈ వ్యర్థ డిస్పోజల్ పెరిగిపోవటం వలన దోమల బెడద ఎక్కువగా ఉన్నదని, ఇప్పటికే వైరల్ జ్వరాలు డెంగీ వంటి అనారోగ్యానికి గురవుతున్నారని, వీటిపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొనుకు వెంకటేశ్వరావు, పితాని బేబీ రావు, కుసుమే నరసింహారాజు, వాసంశెట్టి గణేష్, బొంతు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది అర్జీలు స్వీకరణ

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట మండలం కాపవరం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి 8 అర్జీలను స్వీకరించినట్లు సామర్లకోట తహశీల్దార్ కే చంద్ర శేఖర్ రెడ్డి తెలిపారు. సబ్ డివిజన్ కొరకు 1, ఎఫ్ లైన్ సర్వే కొరకు 4, మ్యుటేషన్ కొరకు 3, రెవెన్యూ సదస్సులో ప్రజల నుండి అర్జీలు అందినట్లు తహశీల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సిఐగా ప్రశాంత్ కుమార్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - అల్లవరం : అమలాపురం నియోజ కవర్గం రూరల్ సిఐగా ప్రశాంత్ కుమార్ బాధ్యతలు తీసుకున్నారు. గతంలో గన్నవరం సిఐగా పనిచేశారు. అమలాపురం రూరల్ సిఐగా బాధ్యతలు చేపట్టడంతో అల్లవరం ఎస్ఐ హరీష్ కుమార్‌తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

విశాలాంధ్ర - అల్లవరం : స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం కోర్స్ డైరెక్టర్, ఎంపీడీవో బి కృష్ణమోహన్ నిర్వహించారు. పేదరికంలేని గ్రామాలుగా, 9 థీమ్స్, బాల సభ, మహిళా సభ, గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని శాఖల నిధులు గుర్తించి సమగ్రంగా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2025-26 తయారు చేసి అప్లోడ్ చేయడం పై శిక్షణ యిచ్చారు. ఎంపీపీ ఇల్లు శేషగిరి రావు, జడ్పీటీసి కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ సర్పంచులు, ఎంపీటీసీలు, ఈఓ ఆర్డీయు నాగేంద్ర, ఏఓ బి లక్ష్మణ రావు, రిసోర్స్ పర్సన్లు రాజ్ మోహన్, శిరీష పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

విశాలాంధ్ర నల్లజర్ల : టీడీపీ పార్టీ కార్యాలయంలో ఆవపాడు, సింగరాజుపాలెం, తెలికిచెర్ల , దూబచర్ల , గంటవారిగూడెం , పుల్లలపాడు గ్రామాలకు చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి రూ. 7,56,673ల చెక్కులను గోపాలపురం నియోజకవర్గ శాసనసభ్యులు మద్దిపాటి వెంకట రాజు అందజేశారు. ముఖ్య నాయకులు టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి సహాయ నిధి ద్వారా అనేకమందికి ఇంతటి చక్కటి కార్యక్రమాన్ని చేపడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అదే విధంగా గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు చేతుల మీదగా చేపట్టిన ఈ చక్కటి సహకారానికి ప్రజానీకం కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు .

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం : ఎంపీపీ

విశాలాంధ్ర - ఏలేశ్వరం : గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని స్థానిక ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 2025-2026వ సంవత్సరం జిపిడిపి, బిపిడిపి యాక్షన్ ప్లాన్ గురించి ఒకరోజు శిక్షణా తరగతులను ఇంచార్జ్ ఎంపీడీవో కేవీ సూర్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ గొల్లపల్లి మాట్లాడుతూ గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడమే లక్ష్యంగా గ్రామపంచాయతీ, మండలస్థాయి అధికారులు పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కిమ్స్‌లో గ్రాడ్యుయేషన్ డే

ప్రతిభా వంతులను సత్కరించిన ఛైర్మన్ చైతన్య రాజు

విశాలాంధ్ర - అమలాపురం : కిమ్స్ డెంటల్ కాలేజ్, హాస్పిటల్, అమలాపురం 4వ గ్రాడ్యుయేషన్ డే, 18 డిసెంబర్ 2024న కిమ్స్ క్యాంపస్‌లో ఘనంగా జరిగింది. గురువారం, కిమ్స్ దంత వైద్య కళాశాల నాల్గవ 'గ్రాడ్యుయేషన్ డే' కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రిన్సిపాల్ డా వి శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కిమ్స్ ఛైర్మన్, కెవీవీ సత్యనారాయణ రాజు, కిమ్స్ ఎండి రవికిరణ్ వర్మ, డా బీసీ రాయ్ అవార్డు గ్రహీత, ప్రముఖ క్రానియోఫేసియల్ మాక్సిల్లరీ సర్జన్ డా ఎస్‌హెచ్ బాలాజీ ముఖ్య అతిథులుగా విచ్చేసారు. ఈ సందర్భంగా డా బాలాజీ మాట్లాడుతూ వైద్యుడిగా పట్టా పుచ్చుకోవడంతో విద్యాభ్యాసం పూర్తి అయినట్లు కాదు అని, విద్యాభ్యాసం ఒక జీవిత కాల ప్రక్రియ అన్నారు. కిమ్స్ దంత వైద్య కళాశాలలో విద్యార్థుల శిక్షణకు గల వసతులను, సాంకేతిక పరికరాలను, అత్యుత్తమ శిక్షణా పద్ధతులు, విద్యార్థుల క్రమ శిక్షణను ప్రశంసించారు. ఈ కళాశాలలో ఉన్నత ప్రమాణాలను నిర్వహించడానికి సహకరిస్తున్న యాజమాన్యాన్ని కొనియాడారు. మొత్తం 87 మంది 2019 బ్యాచ్ బీడీఎస్ విద్యార్థులు, ఏడుగురు ఎండీఎస్. విద్యార్థులు తమ శిక్షణ పూర్తి చేసి, ఈ కార్యక్రమంలో దంత వైద్యులుగా పట్టభద్రులయ్యారని, ముఖ్య అతిథుల చేతుల మీదుగా డిగ్రీ పట్టాలు అందుకున్నారని, ప్రిన్సిపాల్ డా శివకుమార్ తెలిపారు. డా కజ్జాయం కోటేశ్వరి 2019 బ్యాచ్‌లో అత్యధిక మార్కులు సాధించి కిమ్స్ ఛైర్మన్ కెవీవీ సత్యనారాయణ రాజు చేతుల మీదుగా గోల్డ్ మెడల్, యాభై వేల రూపాయల నగదు బహుమతిని అందుకున్నారు. వైద్య వృత్తిలో అడుగు పెడుతున్న నూతన పట్ట భద్రులకు కిమ్స్ ఛైర్మన్ కెవివి సత్యనారాయణ రాజు, ఎండి రవి కిరణ్ వర్మ, జెఎండి శేష పవిత్ర, డైరెక్టర్ రాజ శ్యామల శుభాకాంక్షలు తెలిపారు.

పంచాయతీలకు ట్రాక్టర్లు పంపిణీ

విశాలాంధ్ర - పెదపూడి : పరిశుద్ధమైన, ఆరోగ్యవంతమైన భారత్‌ను ఆవిష్కరించాలన్న మహాత్ముని కలను నిజంచేసి చూపించాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ ధ్యేయమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద మండలంలోని పెద్దాడ, వేంద్ర, గండ్రేడు, ఏపీ త్రయం, సంపర గ్రామ పంచాయతీలకు ఒక్కొక్కటి చొప్పన స్వచ్ఛ భారత్‌లో భాగంగా రూ. 30 లక్షల విలువ చేసే ఐదు ట్రాక్టర్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ ఎంఎస్ఎన్ రెడ్డి, కూటమి నేతలు రావాడ నాగు, సూర్యకుమారి, ఇంకా పలువురు నేతలు, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంపై దిశా నిర్దేశం : ఎమ్మెల్యే నల్లమిల్లి

విశాలాంధ్ర - పెదపూడి : అభివృద్ధి, సంక్షేమం కోసం ఏవిధమైన అవగాహనతో ముందుకెళ్ళాలనే దానిపై ఒక స్పష్టమైన దిశ నిర్దేశం చేయడానికి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిం దని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ, జడ్పీటీసి, ఎంపీటీసీలు, సర్పంచులకు గ్రామ పంచాయతీ డెవలప్మెంట్ ప్లాన్ 2025-26 శిక్షణ తరగతులు నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె నరేంద్ర రెడ్డి, ఈవోపీఆర్డీ ఎంఎస్ఎన్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అక్రమ మట్టి తరలిస్తున్న లారీలు స్వాధీనం

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదార్లంక గ్రామంలో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న మూడు టిప్పర్లను అంగర పోలీస్ స్టేషన్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. గ్రామ ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకు గురువారం రాత్రి పోలీస్ సిబ్బంది, స్థానిక వీఆర్వో బుజ్జిబాబుతో కలసి చేసిన ఆకస్మిక దాడిలో అక్రమ మట్టి రవాణా చేస్తున్న మూడు లారీలు పట్టు పడ్డాయి. పట్టుబడ్డ లారీలను అంగర పోలీస్ స్టేషన్‌కి తరలించారు. తదుపరి విచారణ నిమిత్తం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో గల మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్‌కి సమాచారం అందించినట్లు అంగర ఎస్సై రవికుమార్ పోలీస్ సిబ్బందికి తెలిపారు.

అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలకు, 2025-26వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గ్రామ పంచాయతీ, బ్లాక్ పంచాయతీ, డిస్ట్రిక్ట్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయుట పై అవగాహన కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమం ఎంపీడీవో ఎంవిఆర్ కుమార్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ సుధాకర్ హాజరయ్యారు. ఈ ప్రోగ్రామ్‌నకు కోర్సు డైరెక్టర్‌గా ఎంపీడీవో, సహాయక కోర్సు డైరెక్టర్‌గా ఈవోపీఆర్డీ మరియు ఎంటిలుగా గోకవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి బొజ్జ రాజా, గజ్జనపూడి గ్రామ పంచాయతీ కార్యదర్శి మధుసూదన్ రాజు, సర్పంచులు ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - అనపర్తి : అనపర్తి యూనిట్ పెన్షనర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. శుక్రవారం రామవరంలో అనపర్తి యూనిట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే నల్లమిల్లి ఆవిష్కరించడం జరిగింది.

అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం విజయవంతం

విశాలాంధ్ర - గండేపల్లి : స్థానిక ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో ఐదు రోజుల పాటు సేల్స్‌ఫోర్స్ ప్లాట్‌ఫారమ్ డెవలపర్-1 అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం ఈ నెల16 నుండి 20 వరకు విజయవంతముగా జరిగినదని కళాశాల చైర్మన్ డా పి కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధ్యాపకులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తమను తాము అప్‌గ్రేడ్ చేసుకొని విద్యార్థుల కు శిక్షణద్వారా, విద్యార్థికి వృత్తి విద్య పరంగా, వృత్తి పొందడం సులభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల నుండి 61 అధ్యాపకులు పాల్గొన్నారు. తమిళనాడు ఐసిటి అకాడమీ సీనియర్ టెక్నికల్ ట్రైనర్ జె ఆనంద్ రిసోర్స్ పర్సన్‌గా, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ రుబియా తస్నీం వ్యవహరించారు. సేల్స్ ఫోర్స్‌లో సేల్స్‌ఫోర్స్ ప్లాట్‌ఫారమ్ బేసిక్స్, ట్రైల్‌హెడ్ ప్లేగ్రౌండ్, డేటా మోడలింగ్, సూత్రాలు మరియు ధృవీకరణలు, లైట్నింగ్ యాప్ బిల్డర్, డేటా భద్రత, ఆమోద ప్రక్రియలతో రికార్డులను ఆమోదించుట, అపెక్స్ బేసిక్స్ ఓ డేటాబేస్ మరియు అపెక్స్ ట్రిగ్గర్స్ గురించి జె ఆనంద్ వివరణలతో విశదీకరించారు. ఎఫ్‌డిపి లో(అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం) పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎవి హరనాథ బాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం సతీష్, ప్రిన్సిపాల్ డా జి నరేష్, డైరెక్టర్ డా కె సత్య నారాయణ, కార్పొరేట్ రిలేషన్స్ మేనేజర్ నాగేంద్ర, కెరీర్ డెవలప్మెంట్ సెంటర్ (సిడిసి) డీన్ డా ఎం రాధికామణి, డీన్ రీసెర్చ్ ప్రొఫెసర్ పివిఎస్ మాచిరాజు తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా దిష్టి బొమ్మ దహనం

విశాలాంధ్ర - కడియం : అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో హోంమంత్రి అమిత్ షా చేసిన ద్వేషం, ఎగతాళి, అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కడియం మండలం పొట్టిలంక అంబేద్కర్ విగ్రహం వద్ద, అంబేద్కర్ యువజన సంఘం, జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం అమిత్ షా చిత్రంపై చెప్పులతో కొడుతూ దహనం చేసారు. అమిత్ షా నీ వెంటనే పదవినుండి తప్పించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఆర్పిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా వెంకటరత్నరాజు మాట్లాడుతూ సామాజిక విప్లవ యోధుడు, మహనీయుడు డాక్టర్ అంబేద్కర్ అని, భారత దేశంలో అట్టడుగు వర్గాలకు, కోట్లాది దళితుల ఆత్మ గౌరవానికి అంబేద్కర్ ప్రతిబింబం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోనాల లాజర్, నక్కా చంటి బాబు, కప్పల భాస్కర్, జల్లి రాజు, అంబటి రాజారత్నం, రాయుడు ప్రసాద్, నక్కా రత్నరాజు, పౌల్ రాజు, పాముల శివ, కోనాల ప్రేమ్, జక్కుల నాని, సంబత్తుల సత్తిపండు, కోల్లపు సురేష్, పోసియ్య, వెంకట్, నెల్లి నవీన్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర-దేవరపల్లి: గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతో దోహదపడతాయని మండల తహసీల్దార్ కే రాజలక్ష్మి అన్నారు దేవరపల్లి మండలం లక్ష్మీపురం గ్రామంలో గ్రామ సచివాలయం వద్ద గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు వివిధ సమస్యలపై అర్జీలను తహసీల్దార్ కే రాజ్యలక్ష్మి కి అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొనెల్లి ధన లక్ష్మీ జానకిరామ్ వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు టిడిపి నాయకులు నున్ననాగేశ్వరరావు చిన్ని మింటిమి సురేష్ యాగంటి వెంకటరత్నం దొనెల్లి మధుబాబు వీఆర్వోలు పాల్గొన్నారు

హెల్త్ అసిస్టెంట్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి

విశాలాంధ్ర నల్లజర్ల : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అన్ని విధాలుగా ఆయువుపట్టుగా వున్నా మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని వైద్య ఉద్యోగులందరూ ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. నల్లజర్ల పీ.హెచ్.సీ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో 'వైద్య ఆరోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్లు కావాలి.. పీ.హెచ్.సీ లకు రావాలి!' నినాదంతో జరిగిన కార్యక్రమంలో వైద్య ఉద్యోగులందరూ పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ పీ.హెచ్.సీ డాక్టర్స్ అసోసియేషన్ మద్దతుతో వైద్య ఉద్యోగులందరి సంయుక్త సహకారంతో జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ, కోవిడ్ వంటి ప్రళయంలో ప్రాణాలకు తెగించి సేవలు చేయడం లోనూ, ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో అంటువ్యాధులు ప్రబలకుండా తక్షణ సేవల్లోను, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులోనూ హెల్త్ అసిస్టెంట్ల పాత్ర ప్రధానమైందన్నారు. హెల్త్ అసిస్టెంట్లను కోర్టు ఆదేశాల సాకుతో ఒక్కసారిగా గొంతు కోసి ఉన్నపళంగా ఉద్యోగాల నుంచి పీకేసి నట్టేట ముంచేయడం తీవ్ర అన్యాయమన్నారు. ఇరవై రెండేళ్ల పాటు సుదీర్ఘ సర్వీస్ చేసి 50 ఏళ్ళు దాటిన వయస్సు లో ఉద్యోగం నుంచి బయటకు గెంటెస్తే ఆ ఉద్యోగులపై ఆధారపడ్డ కుటుంబాలు బ్రతికేదెలా.. ఆత్మహత్యలు తప్ప వేరే మార్గం లేదని బాధిత హెల్త్ అసిస్టెంట్లు ఈ కార్యక్రమంలో కన్నీరు మున్నీరవ్వడం పట్ల వైద్య ఉద్యోగులందరూ తీవ్రంగా స్పందించారు. తక్షణమే ప్రభుత్వం కలగజేసుకుని తొలగించిన హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కార్యక్రమంలో పీ.హెచ్.సీ వైద్యులు డాక్టర్ తెల్లం గంగాధరరావు, డాక్టర్ మహ్మద్ సిరాజ్ ఉద్దీన్, అన్ని క్యాడర్ల వైద్య ఉద్యోగులందరూ పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధి ప్రాంతం సందర్శన

విశాలాంధ్ర - కడియం : కడియం మండలం, వేమగిరి గ్రామంలో పర్యాటక అభివృద్ధికి కేటాయించిన ప్రాంతాన్ని శుక్రవారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సందర్శించారు. వివిధ శాఖలకు చెందిన స్థానిక అధికారులతో కలిసి ఈ ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. గోరంట్ల మాట్లాడుతూ స్థానిక మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ఈ ప్రాంతంలో ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం, భవిష్యత్తులో పర్యాటక కార్యక్రమాల కోసం సైట్ యొక్క సామర్థ్యాన్ని అంచనా వేయడం ఈ సందర్శన యొక్క ఉద్దేశ్యాలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్, ఎంపీడీవో కె రమేష్, ఎంఆర్ఓ కె పోసిబాబు, జిల్లా ఉద్యానవన అధికారి దుర్గేష్, నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ, ఇతర స్థానిక అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు పరిష్కారంలో మార్గదర్శకాలు తప్పనిసరి : ఆర్డీవో

విశాలాంధ్ర - కోరుకొండ : రైతులు, ప్రజల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు వచ్చే అర్జీలలో మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలని రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్డీవో)ఆర్.కృష్ణ నాయక్ పేర్కొన్నారు. కోరుకొండ మండలంలోని శ్రీరంగపట్నం గ్రామంలో తహశీల్దార్ వి.సుస్వాగతం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సును ఆకస్మికంగా విచ్చేశారు. దీనిలో భాగంగా పలువురు అందించిన అర్జీలను స్వీకరించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో ఇప్పటివరకు 534 అర్జీలను స్వీకరించడం జరిగిందన్నారు. రెవెన్యూ సదస్సులకు వచ్చే అర్జీలను స్వీకరించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్)పోర్టల్లో నమోదు చేయడంతో పాటు కార్యక్రమానికి వచ్చే అర్జీల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ వి.సుస్వాగతం, రెవిన్యూ అధికారులు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ డోర్ డెలివరీ సేవలు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : సమీప ప్రాంతాలతో పాటు దూరప్రాంతాలకు తరలించి వివిధ వస్తు,సామాగ్రిల కోసం తమ సంస్థ నూతనంగా అందిస్తున్న డోర్ డెలివరీ సేవలను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబానా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ) పరిధిలో ఈనెల 20 నుంచి రానున్న జనవరి 19వ తేదీ వరకు డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఆర్టీసీ వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులుకి శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించి, బ్రోచర్లు ఆవిష్కరించారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 20 నుండి వచ్చే ఏడాది జనవరి 19 వరకు డోర్ డెలివరీ మాసోత్సవాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమైన 80 ప్రాంతాలకు ఈ డోర్ డెలివరీ సదుపాయం అందుబాటు లోకి తెస్తున్నట్లు వివరించారు. డిపో పరిధిలోని 10 కిలోమీటర్లు మేరకు గరిష్టంగా 50 కేజీలు వరకు నిషేధ వస్తువులు మినహా అన్ని సామాగ్రి కొరియర్ చేసుకోవ చ్చని తెలిపారు. రాజమహేంద్రవరం ఎటిఎం కమర్షి యల్ మాధవ, అసిస్టెంట్ మేనేజర్ అజయ్ బాబు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన కలెక్టర్

విశాలాంధ్ర - కాకినాడ : ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ (IISF)2024 హేకతాన్ సైన్స్ ప్రాజెక్ట్ కంపిటీషన్‌లో ఆంధ్రప్రదేశ్‌కి చెందిన కాకినాడ జిల్లా, మదర్ థెరిసా మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్, గోడారిగుంట జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం పొందిన సందర్భంగా విద్యార్థులను, సైన్స్ టీచర్ KRS చంద్రారెడ్డిని అభినందించిన కాకినాడ జిల్లా కలెక్టరు షాన్ మోహన్ సగిలి. తొలుత ఈ పోటీకి ఎంపికైన 7000 ప్రాజెక్ట్స్ దరఖాస్తులు పరిశీలించి 117ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపిక చేశారని, వీటిలో +2 కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కి చెందిన కాకినాడ మదర్ తెరెస పాఠశాల ప్రథమ స్థానం కైవసం చేసుకుని, క్యాష్ ప్రైజ్ మనీ రూ.30,000 గెలుచుకుందని, ఎంపికైన ప్రాజెక్టులు మినిస్ట్రీ ఆఫ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియాకి పంపుతారని, దీనిపై మరింత పరిశోధన జరుగుతుందని చంద్రారెడ్డి తెలియజేసారు. ఈ ప్రాజెక్ట్ వర్క్ ప్రెసెంట్ చేసిన విద్యార్థులు గేదెల బిందు(టీం లీడర్), ఆరెళ్ల దీపిక, ఆనల ప్రవల్లికతో పాటు ఇన్స్పైర్ నేషనల్ 2023 ఢిల్లీకి ఎంపికైన గుత్తుల అనుష్కను, మెంటార్‌గా వ్యవహరించిన చంద్రారెడ్డిని కలెక్టర్ అభినందించారు.

కాకినాడ జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడిగా రఘురామ్

విశాలాంధ్ర - జగ్గంపేట : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట సీనియర్ నాయకులు ఒమ్మి రఘురామ్ కాకినాడ జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడిగా నియమితుల య్యారు. నన్ను అధ్యక్షుడిగా నియమిస్తూ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లేఖను విడుదల చేసినట్లు రఘురామ్ ఒక ప్రకటనలో తెలిపారు.

పవన్ కృషి అభినందనీయం

విశాలాంధ్ర - కాకినాడ : నిధులు లేక కునారిల్లుతున్న గ్రామపంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి కల్పించే దిశగా ఉప ముఖ్య మంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషి అభినందనీయమని మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పాలనలో మార్పును తీసుకురావాలన్న ఆకాంక్షతో ఆయన పని చేస్తున్నారని అన్నారు. ఆ దిశగా ఇప్పటికే ఉపాధి హామీ పథకం నిధులు, 15వ ఆర్థిక సంఘం, స్టాంప్ డ్యూటీ నిధులు విడుదల చేసి తన మార్కు పాలనను రుజువు చేశారని అన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ప్రతి ఒక్కరు వినియోగ దారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి సునీత పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డి సునీత అధ్యక్షతన జాతీయ వినియోగదారుల హక్కులపై డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ మరియు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వినియోగదారుల న్యాయపాలనకు డిజిటల్ మరియు వర్చువల్ హియరింగ్ సౌలభ్యం అనే అంశంపై వివరణ ఇచ్చారు. ఏర్పాటు చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ వినియోగదారుల యొక్క హక్కులైన భద్రత హక్కు, అవగాహన హక్కు, ఎంపిక చేసుకునే హక్కు గూర్చి విద్యార్థులు పూర్తిస్థాయిలో తెలుసుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య విభాగ అధ్యాపకులు డాక్టర్ కే.బంగార్రాజు, ఇతర అధ్యాపకులు కే సురేష్, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ ఎస్‌కే మదీనా, శ్రీలక్ష్మి, సిహెచ్ పుష్ప, మేరీ రోజిలిన, మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

వరుణ్ సందేశ్ ఎంపిక

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలంలో సూరంపా లెంలో ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన ప్రథమ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ డేటా సైన్స్ విభాగం విద్యార్థి జెఎన్టీయుకే వాలీబాల్ మెన్ టీంకి ఎంపిక అయినట్లు సంబంధిత అధికారులు నుంచి ఉత్తర్వులు అందినట్లు ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. 18 నుంచి 22 వరకు యూనివర్సిటీ ఆఫ్ కేరళ, కేరళలో నిర్వహించు సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొన్న జెఎన్టియుకె వాలీబాల్ మెన్ టీంకి ఆదిత్య విద్యార్థి ఎంపిక కావడం అభినందనీయమని డా ఆదిరెడ్డి రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్య సంస్థల వైస్ చైర్మన్ డా నల్లమిల్లి సతీష్ రెడ్డి జెఎన్టియుకె జట్టుకు ఎంపిక కాబడిన వరుణ్ సందేశ్‌ను అభినందిస్తూ రూ.5000ల నగదును అందించి టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి విజేతగా నిలవాలని శుభాకాంక్షలు తెలియజేశారు. డీన్స్, విభాగాధిపతులు ఫిజికల్ డైరెక్టర్స్ పాల్గొన్నారు.

నన్నయ్య యూనివర్సిటీలో చైల్డ్ సైకాలజీ కోర్సు

విశాలాంధ్ర - రాజానగరం : తమ వర్సిటీ అందిస్తున్న చైల్డ్ అండ్ అడాలసెంట్ గైడెన్స్ అండ్ కౌన్సిలింగ్ పీజీ డిప్లొమా కోర్సును అందరు సద్వినియోగం చేసుకోవాలని అదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నన్నయ యూనివర్సిటీలో బ్రోచర్లను వీసీ ఆచార్య శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నన్నయ విశ్వవిద్యాలయంలోని డిపార్ట్మెంట్ ఆఫ్ సైకాలజీ ఆధ్వర్యంలో చైల్డ్ అండ్ అడాలసెంట్ గైడెన్స్ అండ్ కౌన్సిలింగ్ డిప్లొమా ఇప్పటివరకు రెండు బ్యాచ్‌లు విజయవం తంగా పూర్తి కాగా, మూడో బ్యాచ్ అడ్మిషన్లు ప్రారంభి స్తున్నామన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.విజయనిర్మల, అకాడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య కెవి స్వామి, కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్.సకినా నారాయణ, డాక్టర్.పడాల రాజశేఖర్ పాల్గొన్నారు.

కెనాల్ రోడ్డు మరమ్మతు పనులు పరిశీలన

విశాలాంధ్ర - అనపర్తి : ఎన్నో ఏళ్ళుగా కెనాల్ రోడ్డులో ప్రయాణించడానికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏ విధంగానైనా రాజమండ్రి - సామర్లకోట కెనాల్ రోడ్డు అభివృద్ధి చేయడమే ధ్యేయంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కెనాల్ రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను ఎమ్మెల్యే నల్లమిల్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కెనాల్ రోడ్డు బ్లాక్ లిస్టులో పెట్టారని చెప్పడం జరిగిందని రోడ్డును బ్లాక్ లిస్టులో పెట్టరని కాంట్రాక్టర్ బ్లాక్లిస్టులో పెడతారని అందుకే వారిని ప్రజలే బ్లాక్లిస్టులో (వైసిపిని)పెట్టారంటూ ఎద్దేవా చేశారు. ఇప్పటికే అనపర్తి నుండి బిక్కవోలు వరకు రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు పూర్తిచేయడం జరిగిందని అనపర్తి నుండి ద్వారపూడి వైపు రోడ్డు కాంట్రాక్టర్ వ్యక్తిగత సమస్యల వలన చేయలేక వదిలివేయడం జరిగిందని మరో కాంట్రాక్టర్ కి పనులు అప్పగించడంతో పనులు ప్రారంభించడం జరిగిందని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను),మల్లిడి ఆదినారాయణ రెడ్డి, సత్తి దేవదానం రెడ్డి,ఇంకా పలు పురు ఎన్ డి ఏ నేతలు ఉన్నారు

గ్రామాభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

విశాలాంధ్ర - సీతానగరం: జిపిడిపిపై ప్రజా ప్రతినిధులకు శిక్షణ. శుక్రవారం మండలంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ ఎమ్ భారతి అధ్యక్షతన అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులకు 2025-26 సవంత్సారం గ్రామాల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణను పంచాయితీ కార్యదర్శులు అర్ సుజాత, కె స్టిపెన్ పి పి టి సహాయంతో ప్రజా ప్రతినిధులకు వివరించారు. దీనిలో భాగంగా రాబోయే సంవత్సరం గ్రామాలలో అభివృద్ధి దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని అడుగులు వేయాలని గ్రామ అభివృద్ధికి అందరూ సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గుర్రాల జ్యోత్స్న, జడ్పీటీసీ చలమల వెంకటలక్ష్మి, ఈ ఓ పి అర్డీ మూర్తి, ఏ పి ఓ నాగ శేష వేణి, అన్ని గ్రామాల ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి రోగుల పాలిట వరం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గోపాలపురం : ముఖ్యమంత్రి సహాయనిధి రోగుల పాలిట వరమని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు తెలిపారు. శుక్రవారం మండలములోని పలు గ్రామాలలో పలు కారణాల వల్ల అనారోగ్యం గురైన వారి కుటుంబాలకు రూ 25,68,110 చెక్కుల రూపంలో అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేద మధ్యతరగతి , ప్రజా ఆరోగ్యం విషయమై ప్రతి వ్యక్తిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని మద్దిపాటి వెంకట రాజు తెలిపారు. ఇందులో భాగంగా చిట్యాల గ్రామంలో గద్దెజయలక్ష్మి రూ. 1,47,500, జగన్నాధపురం గ్రామంలో గత సంవత్సర కాలంగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న టీడీపీ నాయకుడు పసుమర్తి గంగాధర్‌రావుకు రూ.12,89,990, వెంకటాయపాలెం గ్రామంలో వీరమల్ల రత్నాజీకి రూ. 6,81,560, పెద్దగూడెం , గోపాలపురం గ్రామంలో సాలి రాజేష్‌కి 1,86,200 గుంజే బాలాజీ కి 85,270, గోపవరం గ్రామంలోని మల్లిపూడి భాస్కరరావుకి రూ. 26,093, వెళ్ళచింతలగూడెంలోని గద్దె గోవిందరావు రూ.81,000, దొండపూడి గ్రామంలో వీర వెంకట సత్యవరప్రసాద్‌కి 70,500, ఆయన అందించి ఆరోగ్య పరిరక్షణ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం పసుమర్తి గంగాధర్ రావు ఏర్పాటుచేసిన దుప్పట్లను వృద్ధులకు వితంతువులకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరావు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు రొంగల సత్యనారాయణ, కొర్లపాటి రాము, గద్దె హరిబాబు, వడ్లమూడి రమేష్, పసుమర్తి పెద్దబ్బులు, కాట్రగడ్డ సురేష్, పసుమర్తి రాఘవ చౌదరి, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్దిష్టమైన ప్రణాళికలతోనే పురోభివృద్ధి

విశాలాంధ్ర - ఆలమూరు : నిర్దిష్టమైన ప్రణాళికల రూపకల్పన చేయడం ద్వారానే గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు తప్పక పురోభివృద్ధి సాధిస్తాయని ఎంపిడిఓ, ఇంచార్జ్ డిఎల్పిఓ ఏ రాజు, మండల ప్రత్యేక అధికారి ఏడిఏ కె నాగేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వార్డు సభ్యులకు, సర్పంచులకు, ఎంపీటీసీలకు 2024- 25 ఏడాదికి గాను జిపిడిపి, బిపిడిపిలపై ఒక రోజు మండల స్థాయి శిక్షణ తరగతులు శుక్రవారం ఎంపీడీవో రాజు ఆధ్వర్యంలో నిర్వహించి పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజు మాట్లాడుతూ పంచాయతీలు గాని, మండల పరిషత్ నిర్వహణలో పరస్పర అవగాహనతో అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ప్రజా అవసరాల దృష్ట్యా పంచాయతీలలో తప్పనిసరిగా కొన్ని అంశాలపై దృష్టి పెట్టి పని చేయాల్సిన బాధ్యత పాలకవర్గంపై ఉందన్నారు. పంచాయితీ వ్యవస్థలో ప్రజా ప్రతినిధులు కార్యదర్శులు చేయాల్సిన విధులు, బాధ్యతలు, పరిపాలన, అధికారాలు వంటివి తప్పకుండా తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, మండల పరిషత్తు ఏవో ఎంవి మెహర్ ప్రకాష్, ఏపీఎం ఎం ధనరాజు, ఏపీవో జి అరుణ కుమారి, టిఓటి కె సాయి ప్రసాద్, కార్యదర్శులు, సర్పంచ్లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేయాలి

విశాలాంధ్ర- దేవరపల్లి: గ్రామపంచాయతీలు ఆర్థిక వనరులు సమకూర్చుకొని గ్రామాలలో మౌలిక సదుపా యాలు కల్పనకు కృషి చేయాలని దేవరపల్లి ఎంపీపీ కెవికె దుర్గారావు పేర్కొన్నారు దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మండలంలో పల్లంట్ల త్యాజంపూడి దుమ్మంతును గూడెం సంగాయిగూడెం యాదవోలు గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు సర్పంచులకు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని దుర్గారావు అన్నారు. పంచాయతీ కార్యదర్శులకు సర్పంచ్లకు సచివాలయ సిబ్బందికి గ్రామ పరిపాలన ఆదాయ పనులు సమకూర్చుకోవటానికి వివిధ అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలు అమలుపై రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ తరగతులు ఏర్పాటు చేసిందని దుర్గారావు వెల్లడించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని దుర్గారావు కోరారు ఎంపీడీవో ఎస్ వేణుగోపాల్ రెడ్డి పిఓపిఆర్ఆర్డి రాజారావులు మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పనకు సర్పంచులు కార్యదర్శు లు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి లు బి ఎస్ రామచంద్రరావు షరీఫ్ మండల సూపరిండెంట్ జి శాంతి ఎంఇఎన్ ఆర్ఇఎస్ పిఓ శ్రీనివాసరావు లక్ష్మీపురం ఉప సర్పంచ్ దోనెల్లి జానకిరామ్ పల్లంట్ల ఉప సర్పంచ్ కూచిపూడి సతీష్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. శిక్షణ తరగతులు ముగిసాయి.

CHANGE OF NAME

I, MOHAMMED ABDUL RAB (New Name), S/o MUNISH ABDUL HAMID Late, Previously Called MOHAMMAD ABDUL RAB(Old Name), Resident of D.No.4-1-48/C/2, Behind RTC Complex, Peddapuram, Kakinada-533437, Andhrapradesh. I have changed my name from MOHAMMAD ABDUL RAB (Old Name) To MOHAMMED ABDUL RAB (New Name) for all practical purposes.

క్రీడల్లో యువత రాణించాలి : వర్మ

విశాలాంధ్ర - పిఠాపురం : క్రీడల్లో యువత రాణించి, పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని, తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పిఠాపురానికి తెచ్చిన స్పోర్ట్స్ మినీ స్టేడియాన్ని త్వరలోనే పూర్తిచేసి, క్రీడాకారులకు అందిస్తామని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ పేర్కొన్నారు. పిఠాపురంలో జరుగుతున్న బాక్సింగ్ ఛాంపియన్షిప్ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని, విజేతలకు ఛాంపియన్షిప్ కప్, మెడల్స్ అందజేశారు. ఆర్ఆర్‌బీహెచ్ఆర్ గవర్నమెంట్ హైస్కూల్ మైదానంలో ఏపీ బాక్సింగ్ అసోసియేషన్, కాకినాడ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న 8వ రాష్ట్రస్థాయి పురుషుల బాక్సింగ్ ఛాంపియన్షిప్ పోటీలు ఘనంగా ముగిశాయి. సుమారు అన్ని జిల్లాల నుంచి 140 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీలన్నీ హెూరాహెూరీగా సాగాయి. జనవరిలో యూపీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించిన క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేసే కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే వర్మ ముఖ్య అతిథిగా హాజర య్యారు. వివిధ విభాగా ల్లో జరిపిన ఫైనల్ మ్యా చులను వర్మ ప్రారంభించారు. మ్యచుల అనం తరం విజేతలు విశాఖపట్నం మొదటి, శ్రీకాకుళం రెండో స్థానంలో నిల్వగా మాజీ ఎమ్మెల్యే వర్మ చేతులమీదుగా ట్రోఫీ, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఆర్గనైజింగ్ సెక్రెటరీ పీ లక్ష్మణరావు, రమణరాజు, మొల్లి నాగమురిడిరాజు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, MOHAMMED ABDUL RAZAQ (New Name), S/O MOHAMMED ABDUL RAB, Previously Called MOHAMMAD ABDUL RAZAQ (Old Name), Resident of D.No:4-1-48/C/2, Behind RTC Complex, Peddapuram, Kakinada-533437, Andhrapradesh. I have changed my name from MOHAMMAD ABDUL RAZAQ (Old Name) To MOHAMMED ABDUL RAZAQ"(New Name) for all practical purposes.

వినూత్న ఆలోచనలతో పరిష్కార మార్గాలు కనుగొనాలి

విశాలాంధ్ర - రాజానగరం : వ్యవసాయ రంగంలో ప్రాంతాలవారీగా ఉండే సమస్యలను గుర్తించి నూతన వినూత్న ఆలోచనలను అమలు చేయడం ద్వారా వాటికి పరిష్కార మార్గాలను కనుగొనాలని భువనేశ్వర్ కెఐఐటి పరిశోధనా అభివృద్ధి ఆవిష్కరణల డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ సూజార్ చెప్పారు. మండలంలోని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయ(జిజియు)స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో వర్సిటీ ఛాన్సలర్ కెవివి సత్యనారాయణరాజు అధ్యక్షతన రెండు రోజులపాటు జరగనున్న వ్యవసాయ ఆవిష్కర ణ సదస్సు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. సదస్సు కి విచ్చేసిన అతిథులకు వరి కంకులను అందజేసి,జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆవిష్కరణలకు ఇండోవేషన్లకు నిధులు ప్రధానంకాదని భిన్నంగా ఆలోచించడం ముఖ్యమన్నారు. దేశంలో ప్రస్తుతం ఏపీలో నూతన ఆవిష్కరణలకు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయన్నారు. వ్యవసాయ విభాగంలో బీఎస్సీ పూర్తి చేసిన వారు సైతం వినూత్న ఆలోచనలతో ముందడుగు వేస్తే మంచి ఫలితాలను పొందవచ్చన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన రాజారాం నగర్‌లోని ఆర్‌బిటి డైరెక్టర్ డాక్టర్ పివి కదోలి మాట్లాడుతూ సాంకేతి పరిశోధనలో పరస్పరం విజ్ఞాన మార్పిడి కార్యక్రమాలను జిజియుతో కలసి నిర్వహి స్తామని చెప్పారు. సదస్సు నిర్వాహకులు జీజియూ ఛాన్సలర్ కేవీవి సత్యనారాయణ రాజు(చైతన్య రాజు) మాట్లాడుతూ జిజియు విద్యార్థులు మండలంలోని పలు గ్రామాలను దత్తత తీసుకొని రైతులకు సేవలు అందించాలని సూచించారు. జిజియూ ప్రో ఛాన్సలర్ కే.శశికిరణ్ వర్మ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యుదయానికి దోహదపడేందుకు తమ వర్సిటీలో ఇంజనీరింగ్ కోర్సులతో పాటు స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్, స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ కోర్సులను కూడా ప్రారంభించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేకే హెర్బల్ సంస్థల మేనేజర్ కేర్ కథం , రాజమహేంద్రవరం ఐసిఏఆర్ సిటి ఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎం.శేషు మాధవ్, జిజియు ఉప కులపతి డాక్టర్ యు చంద్రశేఖర్, తదితరులు ప్రసంగించారు. విబిటి ఏపీ డైరెక్టర్ డాక్టర్ అమిత్ చవాన్, ఏఐసీటీఈఏపీ అండ్ టి టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హెడ్ డాక్టర్ ఐ.ఎన్.భీమాలిం గేశ్వర రెడ్డి,రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అకాడమిక్ అధికారి శ్రీరంగం మ్యాథ్యూ పాల్గొన్నారు.

పురపాలక సంఘ కార్యాలయం-నిడదవోలు

ఆర్.ఓ.సి.నెం.13/2024/ఇ1 తేది: 20-12-2024

ఇ-ప్రొక్యూరుమెంట్ షార్టు టెండరు నోటీసు

నిడదవోలు పురపాలక సంఘ పరిధిలో వివిధ వార్డులలో మున్సిపల్ సాధారణ నిధులు **రూ.5.00 లక్షల అంచనాల విలువ గల** ఒక పనిని చేయుటకు 3 రోజుల కాల పరిమితి కలిగిన షార్ట్ టెండరును ఇ-ప్రొక్యూరుమెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రకటించబడినది. వివరములకు http://tender.e-procurement.gov.in దర్శించండి.

1) బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ మొదలు	:	తేది : 20-12-2024 సాయంత్రం గం. 02.00ల నుండి
2) బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు	:	తేది : 23-12-2024 ఉదయం గం. 2.00ల వరకు
3) టెండర్లు దాఖలు చేయుటకు ముగింపు	:	తేది : 23-12-2024 ఉదయం గం. 2.30ల వరకు
4) టెండర్లు తెరచుట	:	తేది : 23-12-2024 ఉదయం గం. 3.00ల నుండి

సం/- టి.ఎల్.సి.ఎస్.ఎస్.కృష్ణవేణి, కమిషనర్, నిడదవోలు పురపాలక సంఘము

గ్రామాల అభివృద్ధి కృషి చేయాలి

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, ఎంపీటీసీలతో కలిసి అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో రవికుమార్ అన్నారు. కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీల డెవలప్మెంట్ ప్లాన్‌పై శిక్షణా తరగతులను నిర్వహించారు. ప్రభుత్వం అందించే నిధుల వినియోగం, విద్య, వైద్యం, పారిశుద్ధ్య నిర్వహణపై తీసుకోవాల్సిన చర్యలు, సమన్వయ పాలన వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యుడు గుబ్బల తులసి కుమార్, మండల విస్తీర్ణ అధికారి హరికృష్ణ పలు అధికారులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిపై శిక్షణ

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలంలోని గ్రామాల అభివృద్ధికై ప్రజా ప్రతినిధులకు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో ఎంపిడిఓ ఏవిఎస్ చంద్రశేఖర్, ఈఓ పి ఆర్డి సూర్య భాస్కరరావులు మాట్లాడుతూ రాబోయే 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏవిధంగా పనులను గుర్తించాలి, గ్రామాలను ఎలా అభివృద్ధి చేసుకోవాలి అనే అంశాల గురించి వివరించారు. కేంద్రం నుండి వచ్చే నిధులను ఎలా సద్వినియోగం చేసుకోవాలి అనే విషయాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిఎమ్ వై ప్రశాంతి, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

విశాలాంధ్ర - యానాం : రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు. కాంగ్రెస్ నాయకులు నిరసన మరియు శాంతియుత ర్యాలీ. యానాం కేంద్రపాలిత ప్రాంతం నియోజకవర్గ పరిధిలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో ఒక ప్రసంగంలో అంబేద్కర్‌ను కించపరుస్తూ పరుష పదజాలంతో మాట్లాడిన తీరును ఖండిస్తూ యానాం నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు నిరసన మరియు శాంతియుత ర్యాలీని చేపట్టారు. స్థానిక పాత బస్టాండ్‌లో గల అంబేద్కర్ నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యానం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్ధాన్ని దినేష్, మల్లాడి సత్తిబాబు, లంక బంగారం, దున్న చక్రవర్తి చీకట్ల రామకృష్ణ, మెల్లం చిన్న, మల్లాడి బీర సామి, శ్రీమంతుల శ్రీధర్ గణేష్ పాల్గొన్నారు.

భూపతిపాలెంలో జూనియర్ కళాశాల ప్రతిపాదన : కలెక్టర్

విశాలాంధ్ర - గోకవరం : శుక్రవారం గోకవరం మండలం భూపతిపాలెం ఏపి రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టరు సందర్శించారు. ఈ సందర్భంగా రెసిడెన్షియల్ పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గల్లా రామచంద్ర రావు జూనియర్ కళాశాల ప్రతిపాదనపై కలెక్టర్ కోరడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, భూపాలపాలెం రెసిడెన్షియల్ పాఠశాల నిర్వహణ, జూనియర్ కళాశాల ఏర్పాటు కు అనుకూలత, అందుబాటులో ఉన్న స్థలం తదితర అంశాలపై చర్చించడం జరిగింది. గతంలో రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన అన్యాక్రాంతం అయిన భూమిని స్వాధీనం చేసుకున్నట్లు పేరెంట్స్ కమిటీ చైర్మన్ గల్లా రామచంద్రరావు తెలిపారు. ఇక్కడ 480 విద్యార్థులు చదువుకుంటున్నారని వివరించారు. ఇక్కడ జూనియర్ కళాశాల అవశ్యకత ఉందనీ, ఇప్పటికే శాసన సభ్యులు జ్యోతులు నెహ్రూ ఆధ్వర్యంలో మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేష్ బాబుకి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. కలెక్టరు ప్రశాంతి మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితిని పరిశీలన కోసం రావడం జరిగిందన్నారు. త్వరలో ఉన్నతాధికారులు పర్యటించి సమగ్ర నివేదిక ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. కలెక్టరు వెంట రెసిడెన్షియల్ పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గల్లా రామచంద్ర రావు, ప్రిన్సిపల్ బి. రవి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి కృషి : మంత్రి

విశాలాంధ్ర-నూజివీడు : నూజివీడు ఏరియా ఆసుపత్రికి వచ్చే ఏ ఒక్క రోగి ఇబ్బంది పడకుండా అత్యుత్తమ వైద్య సేవలందించేలా నూజివీడు ఏరియా ఆసుపత్రిని ఏలూరు జిల్లాలోనే నెంబర్‌వన్ ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలపై ప్రజలకు నమ్మకం పెంచేలా పనిచేయాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. అత్యవసర చికిత్స కోసం నూజివీడు ఏరియా ఆసుపత్రికి వచ్చిన ఏ రోగిని ఇతర ఆసుపత్రులకు పంపకుండా అత్యుత్తమ వైద్య సేవలందించేలా సిబ్బంది పనిచేయాలని, అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య పరికరాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. నూజివీడు ఏరియా ఆసుపత్రిలో కొత్త భవనం నిర్మించి 7 నెలలు అయినప్పటికీ ఇంకా వినియోగంలోకి తీసుకురావకపోవడంపై అధికారులను మంత్రి ప్రశ్నించారు. ఫినిషింగ్ పనులు ఉన్నాయని ఈ నెలాఖరు నాటికి ప్రారంభానికి సిద్ధం చేస్తామని అధికారులు తెలియజేయడంతో జనవరి, 7న వైద్య ఆరోగ్య శాఖామంత్రితో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా నూజివీడు ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా మంత్రి పార్థసారథి, సభ్యులుగా ఇళయరాజా, ఎం. వెంకట కామేష్, డా. ఝాన్సీరాణి, సబ్ కలెక్టర్ సమరం రాజ్, డా. నాదెండ్ల శ్రీకాంత్, గొల్ల దుర్గ దేవి, మెంబెర్ కన్వీనర్ గా డా. నరేంద్ర సింగ్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయాధికారి డా. పాల్ సతీష్, ఏపి ఎం ఐ డిసి ఈ కె. నాగార్జున, డా. శ్రీనివాసరావు, మునిసిపల్ కమీషనర్ ఆర్. వెంకటరామిరెడ్డి, ప్రభృతులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - గోకవరం : పేదలు ఎదుర్కొంటున్న భూ సమస్యలపై అందే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి, గైడ్లైన్స్ కి లోబడి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం గోకవరం మండలం కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలనుంచి వచ్చిన వినతులను కలెక్టర్ ప్రశాంతి పరిశీలించారు. ముఖాముఖి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని చెప్పారు. గోకవరం తహసీల్దారు ఎంవి సాయి ప్రసాద్ వ వివరాలు తెలియచేస్తూ, మండల పరిధిలో మధ్యాహ్నం 2 గంటల వరకు 20 మంది అర్జీలు ఇవ్వడం జరిగిందని, ఇప్పటి వరకు మొత్తం మండల పరిధిలో అర్జీలను స్వీకరించినట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో కె ఆర్ సీసీ ఎస్ డి సి ఎస్ . భాస్కర్ రెడ్డి, తాహసిల్దార్ ఎంవి సాయి ప్రసాద్, ఏ డీ ఏ చంద్రశేఖర్, డిప్యుటీ తాహసిల్దార్, మండల సర్వేయర్ , ఇతర మండల అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల బకాయిలు చెల్లించాలి : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర - వేలేరుపాడు : డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థుల ఫీజు బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యర్రా మధు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి వేలేరుపాడు ప్రధాన కూడలిలో మానవహారం చేపట్టి శుక్రవారం విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ నెలల తరబడి విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్, వసతి దీవెన బకాయిలు పడటంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ. 2100 కోట్లు, వసతి దీవెన రూ.1480 కోట్లు విడుదల చేయాల్సి ఉందన్నారు. దీంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నాయన్నారు. మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చినా అవేమీ పట్టించుకోకుండా కళాశాల యాజమాన్యాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో దాదాపు 9.5 లక్షల మంది విద్యార్థులు డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఏపీజీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీ ప్రకారం జీవో నెంబర్ 77 రద్దు చేసి మాట నిలబెట్టుకోవాలన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని లేకుంటే రానున్న రోజుల్లో మరిన్ని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి బంధం నాగేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ నాయకులు బేతం మల్లి, కమ్మచిచ్చు కిరణ్, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పటిష్టమైన పరిపాలనకు ప్రత్యేక చర్యలు

విశాలాంధ్ర - పెద్దాపురం : పట్టణాల్లో పటిష్టమైన పరిపాలనా విధానానికై ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ సీహెచ్ నాగ నరసింగరావు అన్నారు. పెద్దాపురం మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కాకినాడ జిల్లా స్థాయి పురపాలకాధికారులతో పట్టణ అభివృద్ధిలపై ఆయా పురపాలక సంఘ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్డీ నాగ నరసింగరావు మాట్లాడుతూ రీజనల్ పరిధిలోని ఐదు ప్రధాన నగరాలతో పాటు 31 మున్సిపల్ పరిధిలోని ప్రతీ నెలా పట్టణ ప్రణాళికాభివృద్ధిపై నెలకో మున్సిపాల్టీలో జిల్లా స్థాయిలో సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగానే కాకినాడ జిల్లా స్థాయిలోని కాకినాడ నగర పరిధి మినహా మిగిలిన మున్సిపల్, నగర పంచాయతీలపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా ఇంటిపన్నుల వసూళ్ల ప్రక్రియలో పెద్దాపురం పట్టణం నూరు శాతం ముందంజలో ఉందని, జిల్లాలోని పిఠాపురం మున్సిపాల్టీలో వసూళ్ల ప్రక్రియను మరింత వేగవతం చెయ్యాలని ఆర్డీ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణ అభివృద్ధి, ఆదాయ వనరులతో పాటు పట్టణాలకు అవసరమైన తాగునీటి, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఏ మున్సిపాల్టీలోనూ తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ పట్ల అశ్రద్ధ వహించవద్దని, అటువంటి పరిస్థితి వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. సచివాలయ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించాలని, సచివాలయ సిబ్బందిచే మంచి సేవలందించుకోవాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. అనంతరం పలు అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పెద్దాపురం, తుని మున్సిపల్ కమిషనర్లు పద్మావతి, వెంకట్రావు. మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, డీఈ ప్రకాశరావు, ఏఈ జీవప్రసాద్‌తో పాల్గొన్నారు.

23న 'జాబ్‌మేళా'

విశాలాంధ్ర - కాకినాడ : 'వికాస' ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీ సోమవారం 'వికాస' కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ'లో 'జాబ్‌మేళా' నిర్వహిస్తున్నారు. ఈ జాబ్‌మేళాలో టీమ్‌లీజ్‌లో బ్రాంచ్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, మహీంద్రా ట్రాక్టర్స్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్, సైపర్‌వైజర్, మెకానిక్ హెల్పర్స్, హెచ్.ఆర్. ఎగ్జిక్యూటివ్ & కస్టమర్ రిలేషన్ షిప్ మేనేజర్, ఒడిగోస్ కంపెనీలో అడ్మిషన్స్ కో-ఆర్డినేటర్, ఇండో ఎం.ఐ.ఎం, హోండా య్ మోబీన్ & కె.ఐ.ఎం.ఎల్. కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. డి.యు.జి.కె.వై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రెనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రెనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లోమా, డిగ్రీ & బి టెక్, ఉత్తీర్ణులైన 35 సం.లోపు అభ్యర్థులు అర్హులు. మరిన్ని వివరాలకు 7799376111, డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు.వికాసజాబ్స్.కాం సంప్రదించవలెను.

గ్రామాభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

విశాలాంధ్ర - కరప : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు శుక్రవారం ఎంపీపీ పెంకె శ్రీలక్ష్మి సత్తిబాబు అధ్యక్షతన గ్రామ అభివృద్ధి ప్రణాళిక పై శిక్షణ కార్యక్రమాన్ని సర్పంచులకు ఎంపీటీసీలకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. జెపిటిసి వై సుబ్బారావు పాల్గొని గ్రామపంచాయతీలో అభివృద్ధి నిధులతో చేస్తున్న వర్కులు సంబంధించి తీర్మానాలు గాని, ప్రోటోకాల్ గాని పాటించకుండా పనిచేసుకుపోతున్నారని అలాంటప్పుడు ఈ శిక్షణా కార్యక్రమాలు దేనికని నిలదీయడంతో అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారని తెలిసింది. ఎంపీడీవో అనుపమ, ఈవో పిఆర్ డి శ్రీనివాసరావు, పంచాయతీలకు కేటాయించిన నిధులతో ప్రణాళిక బద్ధంగా మౌలిక వసతులు కల్పించి అన్ని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు గ్రామ సభలు ఏర్పాటు చేయుట, బాలసభలు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని శిక్షణలో తెలిపారు. మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధే లక్ష్యంగా కృషి చేయాలి

విశాలాంధ్ర - పెదపూడి : గ్రామాలాభివృద్ధే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న సర్పంచులు, ఎంపీటీసీ సభ్యుల ఒకరోజు శిక్షణ తరగతులకు ఆయన శుక్రవారం హాజరైయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధికి ఏ విధంగా ప్రణాళికలు తయారు చేయాలో ప్రజా ప్రతినిధులు అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం మండలంలో ఐదు గ్రామ పంచాయతీలకు మంజూరైన ఐదు ట్రాక్టర్లను ఎమ్మెల్యే ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె నరేంద్రరెడ్డి, ఈఓపీఆర్డీ ఎం సత్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ కరెడ్ల వెంకన్నబాబు, ఎన్డీఏ నాయకులు పాల్గొన్నారు.